# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డి.జె. బాలకృష్ణ లాల్
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 38 సంచిక 9
పేజీలు 44
మే 2019

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో ............................ ....... పేజీ**

భద్రవాక్యం ........ 4
శ్రీబాబూజీ ఉవాచ........ 5
అమ్మమాట........ 8
శ్రీబాబు బృందావన ధామము-
శ్రీ స్వామినారాయణ్ అక్షరధామము ....... 10
వికారి నామ సంవత్సర విశిష్ఠత ........ 13
భక్త షేక్ ఫరీద్ ... ... ..... ........ 16
సప్తసప్తాహాల సత్సంగ సమావేశాల - విజ్ఞప్తి 18
నచికేతుడు ........ 19
కోపం ........ 21
శ్రీ గురుభక్తి విశేషము ......... ..... ....... .. 24
కర్మ-గడ్డం ........ 26
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు........ 28
శ్రీకృష్ణ కర్ణామృతము ........ 29
పరిప్రశ్న ........ 30
భ్రాంతి ........ 32
కైవల్యోపనిషత్ ... ........ 34
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....36
శ్రీమాతాజీ ఆశ్రమేతర కార్యక్రమాలు 38
శ్రీమాతాజీ విదేశ పర్యటన కార్యక్రమాలు 39
విష్ణు కథలు ...... ........ ........ 41

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

## అమృతబిన్దూపనిషద్

**8. తదేవం నిష్కలం బ్రహ్మ, నిర్వికల్పం నిరంజనమ్।**
**తద్బ్రహ్మాహమితి జ్ఞాత్వా, బ్రహ్మ సమ్పద్యతే ధ్రువమ్॥**

మానవులంతా తమ యదార్థ స్థితిని గుర్తించనివారు ఎవరైనా తాము జీవించే జీవన విధానమే సరియైనదని జీవిస్తూ తాము భక్తులమని శాశ్వతంగా అనుకోవటం సహజం. సాధకులంతా తాము ముక్తిని కాంక్షించే వారమని ఆశతో జీవిస్తారు. ఇవన్నీ భావనలతో కూడినవే సుమా! యదార్థంగా మానవుడు సాధారణ మానవుడయినా, సాధకుడయినా తన జీవిత ధ్యేయమైన పరంధామాన్ని లేక శాశ్వతానంద స్థితిని చేరేటందుకు ఆచరణాత్మక ప్రయత్నం చేయనంత వరకు వాచా వేదాంతమే అవుతుంది. మేము భక్తులం, జిజ్ఞాసువులం, సాధకులం, ముముక్షువులం అని భావన చేసినంత సేపు అది కేవలం భావనే. ఆచరణకి అందని అగమ్య గోచర స్థితియే సుమా! నిత్య జీవితంలో ప్రతి ఇంద్రియ కదలికను గమనించి సరి చేసుకోవలసి వుంటుంది. ఇంద్రియాలన్నీ గోళకాలే. అచేతనమైనవే. వాటిని నిర్దేశించేది చేతనారూపమైన 'తానే'. అందువలన ఇంద్రియాలను అవసరమైనంత వరకే వినియోగించుకుని ఇంద్రియ సంయమనం సాధించాలి.

మానవులంతా వ్యావహారికంగా మాట్లాడుతూ ప్రాపంచిక కర్మలలో చిత్త ఏకాగ్రత సాధించినప్పుడు ఇంద్రియ ధ్యాస లేదని చేసే భావన సరికాదు. అది అభావ స్థితి కాదు. కేవలం అభావ స్థితిలోనే ఇంద్రియధ్యాస రహితమవుతుంది. ఎందుకంటే అక్కడ చిత్తము, లేక మనస్సు, ఇంద్రియాలతో తాదాత్మ్యం చెందదు. సాధకులంతా 'అహం' లేక 'నేను'గా భావన చేసేది సమస్త జీవరాసులలోను సమంగా గుర్తించ గలుగుతాడా? అది శబ్దవాచ్యంగా కాకుండా వాస్తవంగా తానుగా గుర్తెరిగి ఆనందించ గలిగినవాడే బ్రహ్మము. ఆ స్థితిలోని సాధకుడు నామరూపాత్మక విచ్ఛిన్నతగాని, భిన్నతగాని గుర్తెరగడు. అంతేకాదు, నిష్కళంకం, నిర్వికల్పం, నిరంజనం, నిరాకారం అనే శబ్దాలన్నీ తన నిత్య జీవితంలో తాను నిర్వహించే నిత్య కర్మలకు, వ్యావహారిక చేష్టలకు వర్తింపచేసుకుని జీవించగలిగిన వాడు నిజమైన బ్రహ్మగా ఆచరించి అనుభవించ గలిగితే పరమపదమే గమ్యము.

# శ్రీబాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి)

- పరాశర ప్రసాద్

31-1-1980

ఈరోజు ఉదయం వాకింగ్ చేస్తుండగా 'శ్రీరామ జయరామ జయజయరామ' అనే నామాన్ని పాడుకున్నాము.

"ఈ దివ్యమంత్రమే సమర్థ రామదాసుగారిని తరింపజేసినది" అన్నారు శ్రీ బాబు. అయితే ఆయన 'శ్రీరామ జయరామ జయజయరామాయస్వాహా' అనేవారు.



నమః అనకుండా స్వాహా అనటం ఎందుకో? అని గుండె దడదడ లాడుతుంది. స్వాహా అంటే సర్వ సమర్పణ అన్నమాట. ఎవరికి? తారక పరబ్రహ్మమునకు. అలా సమర్పిస్తే తానే తారక పరబ్రహ్మ స్వరూపుడౌతాడు. 'రెండునుంచి ఒకటి తీసివేస్తే ఒకటి మిగులుతుంది. ఒకటి నుంచి ఒకటి తీసివేస్తే అంతా పూర్ణం. అది పూర్ణం. ఇదీ పూర్ణం. లోపల పూర్ణం, బయట పూర్ణం. అంతా పూర్ణం. అలా తారక పరబ్రహ్మ స్వరూపుడు కావాలంటే ఆ రాముడిలో ఉన్నది తాను పొందాలి. ఆయనలో లేనివి విడిచిపెట్టాలి. అప్పుడు ఆ తారకరామునికి మనకి తేడా ఉండదు' అన్నారు శ్రీ బాబు.

"బ్యాటరీలైటు వేయగానే వెలగటం చీకటిని పారద్రోలటం ఒకసారే జరుగుతుంది. అలాగే తనలో అజ్ఞానపు చీకటిపోగానే వెలుగు స్వరూపుడౌతాడు. ఆ వెలుగు అగ్నికన్నా తేజస్సు గలది. అగ్నిలో వేడి వుంది. కాని ఆ వెలుగులో చల్లదనం హాయి ఉంది. అలా తారకబ్రహ్మ స్వరూపుడు తానైనవాడు, రత్నాకరుడు (వాల్మీకి). పూర్వాశ్రమంలో ఆయనలో అసుర ప్రవృత్తి చాల ఘోరమైనది. రాక్షసుడైనా ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడైనా దయ చూపుతాడేమో గాని, రత్నాకరుడు మాత్రం దయకూడ చూపని

కిరాతకుడు. అట్టి రాక్షస ప్రవృత్తి కూడ దైవప్రవృత్తిగా మారి అతడు శక్తిమంతుడై, మహాపవిత్ర గ్రంథమైన రామాయణం ఆయన నోటినుండి వెలువడింది. ఆ గ్రంథం రామనామ మహాసాగరం. ఆ సాగరంలో ఓలలాడి తరించమని మానవకోటికి శ్రీ వాల్మీకి అందించిన అమృతసాగరం. అందులో స్నానము చేసినవారు అమృత స్వరూపులౌతారు. అమృతం సేవించిన దేవతలకైనా ప్రమాదం ఉందిగాని, ఈ రామనామ సాగరంలో అట్టి ప్రమాదం లేదు.

ఆ రామనామ అమృతం గ్రోలి గుహుడు తరించాడు. శ్రీరామచంద్రుని పాదపద్మములను తన హృదయములో బంధించి, భవబంధ విముక్తి పొందాడు. తారకనామములోని శక్తిని ఋజువు పరచినవాడు జితేంద్రియుడు. యయాతికి అభయం ఇవ్వటం వలన, జితేంద్రియునికి రామునితో యుద్ధం చేయవలసి వచ్చింది. రాముడు జితేంద్రియుని జనకుడు, రక్షకుడు. జితేంద్రియుడు రాముని బిడ్డ. మహాభక్తుడు. మారుతిభక్తిని వెల్లడి చేయటానికి రాముడు యయాతి ఉపాఖ్యానమును కల్పించి ఆడిన నాటకముగాని మరేదీకాదు" అని శ్రీ బాబు చెప్పారు.

'నేను నీ గురువును కదా!' అని రాముడు అడిగినపుడు,

'అవును ప్రభూ! గురువాక్యమే పరిపాలిస్తున్నాను' అన్నాడు మారుతి.

'స్వామీ! అని శరణు కోరినవారికి అభయమివ్వమని నీవు నేర్పిన విద్యయే కదా! నీరజాక్షా!' అంటాడు మారుతి.

'నాకే తెచ్చిపెట్టావురా తండ్రీ తిప్పలు' అనుకొని, 'నా రామబాణం శక్తి తెలుసునా?' అన్నాడు శ్రీరామచంద్రుడు.

'తెలుసు ప్రభూ! అంతేకాదు రామనామము ఆ రామబాణము కన్న శక్తివంతమైనదనికూడ తెలుసు' అంటాడు మారుతి.

'నీకు అంబులపొది, ధనస్సు అవసరమేమోగాని, నాకు ఆయుధముతో నిమిత్తములేదు. నీ రామనామమే నాకు రక్ష, నా హృదయంలో ఉన్న ప్రభువే నాకు రక్ష' అంటాడు జితేంద్రియుడు.

'చూశారా! అదే అచంచలమైన భక్తి అంటే! అదే ఆయనను రక్షించింది' అన్నారు శ్రీ బాబు.

'శ్రీ రామచంద్రుడు వేసిన బాణములు మారుతిని ఏమి చేయకపోగా అవి అన్నీ రామునికే తగిలాయి. లక్ష్మణుడు అది చూసి ఆశ్చర్యపోయాడు. మారుతికి రామునికి బేధము లేదుకదా! అందుచేతనే రామబాణం రామునికే తగిలింది' అన్నారు శ్రీ బాబు.

పోనీ రాముని పలకరిద్దామా అంటే ఆయన మారుతి హృదయంలో బంధింపబడ్డాడు. జితేంద్రియుడు సమాధి నుంచి బయటికి వస్తేనే రాముడు పలికేది. అందుచేత వారంతా సమాలోచనచేసి చివరికి 'రాముడు మూర్ఛపోయాడు' అని బిగ్గరగా అనేసరికి, జితేంద్రియుడు కోపంతో, 'ఆ! నా ప్రభువుకు ఎవరు అపకారం చేశారు?' అంటూ బాహ్యస్మృతిలోనికి వచ్చాడు.

వారంతా వెంటనే మారుతీ ఏమీలేదు నాయనా! నీకూ రామునికీ యుద్ధమేమిటి? రాముడు క్షేమమే అంటారు.

ఈలోగా రాముడు 'మారుతీ నాయనా, గట్టివాడవురా! ఆ యయాతిని తీసుకువచ్చి నా పాదములమీద పడవేయి, రక్షిస్తాను' అంటాడు.

జితేంద్రియుడు అంతటి మహాభక్తుడు. అతని మనస్సు పూర్ణిమ చంద్రబింబమువలె తారక బ్రహ్మరూపమును పొందింది. మీ మనస్సు కూడ అట్టి రూపము ధరించుగాక! ఈరోజు గురుపూర్ణిమ. చక్కని బోధవచ్చింది. ఈ బోధని విని ఆచరించండి చాలు" అన్నారు శ్రీ బాబు.

డాక్టరు రాజునుద్దేశించి "మీ జుట్టు నెరిసిపోయింది. జుట్టు నెరవటంకాదు, మనస్సు నెరవాలి" అన్నారు.

"నా వయస్సు ఎంతో తెలుసుకుందామంటే, పుట్టుకలేనివానికి వయస్సు ఏముంటుంది? అలా పుట్టుకలేనివాడే అక్షర స్వరూపుడైనాడు. అక్షరస్వరూపుని తెలుసుకుంటే అజ్ఞానము హరియించునే మనసా! అజ్ఞానము హరియిస్తే భవబంధములు తొలగునే జీవా!" అని ముగించారు శ్రీ బాబు. అంతా సెలవు తీసుకున్నాము.

(గత సంచిక తరువాయి) **అమ్మమాట** - జపమాల ప్రసాద

## వేదాంత వీధుల్లో విహరించు గిరిధారి

వరాహ రూపంలో వచ్చిన రాముడిని తులసీదాసు గుర్తించక పోగా, బడితపూజ చేసి మరీ తరిమివేశాడు. 'అయ్యో! నా రాముడు నాకు దర్శనమిస్తానని చెప్పి మాట దాటాడు' అని హనుమంతునికి ఫిర్యాదు కూడా చేశాడు. అప్పుడు మారుతి తిన్నగా రాముని వద్దకు వెళ్ళి, అది న్యాయమా అని అడుగుతాడు. శ్రీరామచంద్రుడు జరిగినది చెప్పి, తన వీపు మీద వున్న వాతలు కూడా చూపిస్తాడు. మారుతి బ్రతిమిలాడి రాముడిని తులసీదాస్‌కు మరొక ఛాన్స్ ఇవ్వమని కోరతాడు. మారుతి మాటని కాదనలేక రాముడు సరేనని ఈ సారి లక్ష్మణునితో సహా తురుష్క వేషంలో రెండు గుఱ్ఱాలెక్కి వెడతాడు. అయినా తులసీదాసు గుర్తించడు. అప్పుడు రాముడు హనుమతో 'నాయనా! హనుమా! తులసీదాసు ఇంకా



రూప, నామ భేదాలనే గొలుసులతో బంధింపబడి వున్నాడు. వాటిని వదిలితేగాని నన్ను గుర్తించలేడు' అని అంటాడు. కనుక పరమాత్ముడు నామ, రూపాలకు, దేశ, కాలాలకు అతీతుడని తెలిసిన నాడే మనకి భగవంతుని యొక్క సర్వవ్యాపకత్వం అనుభూతమవుతుంది. అప్పుడు బంగారు గొలుసు క్రిందపడినా ఎత్తుతాం, మలం పడినా ఎత్తుతాం.

ఇవన్నీ విచారణ ద్వారానే వస్తాయి. మీకు విచారణ లేదనికాదు. తినే దాంట్లో కరివేపాకు, ఎండుమిర్చి ముక్కలు వేస్తే, తీసి ప్రక్కన పెట్టాలని తెలుసు. ములక్కాడ వేస్తే దానిలో గుజ్జునే తిని, పైన గట్టి తొక్కని వదిలివేయాలని తెలుసు. ఏది తినాలో, ఏది తినకూడదో, ఏది కట్టుకోవాలో, ఏది కట్టుకోకూడదో అన్నీ తెలుసు. కాని బ్రతుకుకి సారమిచ్చే తెలివితేటలు లేవు మనకి. ఈ ప్రపంచమంతా పాలయితే, అందులో అంతటా దైవత్వం దాగి వున్నది. ఆ దైవత్వాన్ని నువ్వు చూడాలి అనుకుంటే

మానసిక ఆరాధన చేయాలి. మనస్సు యొక్క విచారణా బలంతో ఈ సత్యాసత్య ప్రపంచాన్ని మథించాలి. దానిలో దాగివున్న సారమైన సత్యాన్నే గ్రహించి, అసత్యాన్ని వర్జించాలి.

నీలో వుండి, నిన్ను నడిపిస్తున్న సత్యం మార్పులేనటువంటిది. ప్రపంచం అసత్యం. పరమాత్మ ప్రాణరూపంలో మనలో వుండబట్టే 'వున్నది', 'వున్నాడు' అని అనగలుగుతున్నాము. డాక్టర్లు క్లోరోఫామ్ ఇచ్చి, దేహం నుండి మనస్సును వేరుచేసి, ఆ దేహాన్ని కోసినా మనకేమీ తెలియటం లేదు. అదే విధంగా లక్ష్యార్థంపై మనసు నిలిచిపోయినప్పుడు ఇహ ఈ శరీర ధ్యాస వుండదు. అప్పుడు నిందా స్తుతులు, మానావమానాలు, సుఖదుఃఖాలు, శీతోష్ణాలవంటి ద్వందాలకి అతీతుడై వుంటాడు. పరమమైన ప్రేమయే భక్తి. భక్తి యొక్క పరాకాష్ఠయే జ్ఞానం. జ్ఞానం యొక్క పరాకాష్ఠయే మోక్షం. ఇవి శ్రీ గురుదేవుల వాక్కు. అది అమోఘం. దాని మీద శ్రద్ధపెట్టి విచారణ చేసిననాడు అది మనకి అంది తీరుతుంది.

మీ ఐ-ప్యాడ్‌లోను, స్మార్ట్ ఫోన్‌లోను 'ఆప్‌లు' పెంచుకుంటూ పోతే, వాటి బ్యాటరీ తొందరగా డ్రెయిన్ (ఖాళీ) అయిపోయినట్లు, మీ మనస్సు నిండా ప్రాపంచిక విషయాదులు, కోరికలు నింపివేసుకుని, వాటికోసమే పరుగులు పెడుతూ వుంటే, మీలో ప్రాణ రూపంలో వున్న బ్యాటరీ హరించుకుపోతుంది. 'దీపం కొండెక్కెలోగానే నీ పని చక్కగా ముగించుకో!' కనుక, త్వరపడండి. మీ హృదయాలని వేదాంత వీధులుగా మార్చుకోండి. అప్పుడు అందులో విహరించే గిరిధారిని గుర్తించగలుగుతారు. అది సాధించడానికి కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి, గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!



# శ్రీ బాబు బృందావన ధామము - శ్రీ స్వామి నారాయణ్ అక్షర ధామము



(గత సంచిక తరువాయి)

భగవంతుని వల్ల గాని భగవద్భక్తుని వల్లనే మోక్షం లభిస్తుందని వేద పురాణాలు ఘోషిస్తున్నాయి. అష్టాంగయోగము, తపస్సు, వైరాగ్యము, తీర్థయాత్రలు, పట్టుదల, యజ్ఞాలు, దానం, సత్సంగం - వీటి ద్వారా భగవదనుగ్రహాన్ని పొందగలము.

పూజ, భగవత్కథా శ్రవణము, నామస్మరణ, ధర్మాచరణ - వీటి ద్వారా జీవునికి ముక్తి లభిస్తుంది. నిష్కాముడు, నిర్మలుడు,నిస్సంగుడు అయిన సాధువు ఎల్లప్పుడు భగవంతునియందే దృష్టి నిలిపి ఉంటాడు. అతడు గుణాతీతుడై వుంటాడు. ఆ స్థితిని సాధించాలి.

సత్పురుషులద్వారానే శాస్త్ర పఠనం చేయాలి. భగవంతుడు ఎటువంటివాడు? అద్వితీయుడు, సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, కరుణామయుడు, ప్రేమమూర్తి. స్వామి నారాయణ్ అటువంటి పురుషోత్తముడు. జీవ కారుణ్య భావంతో లోకోద్ధరణకోసం అవతరించినవాడు. ఆయన అక్షరుడు. పరబ్రహ్మ స్వరూపుడు. మోక్ష ప్రదాత.

**శ్రీబాబూజీ మహరాజ్ :**

తనను ఆశ్రయించిన వారందరికీ ఆత్మానందాన్ని ప్రసాదించి ఇహ పరాలలో కొదవ లేకుండా తీర్చి దిద్దే సమర్థ సద్గురువులు.

బ్రహ్మజ్ఞానికి ఒకదానిపైనే ఆశ; బ్రహ్మ జ్ఞానికి లేదు వినాశము; ఎవరు బ్రహ్మజ్ఞాని? ఏమిటి అతనికి ఒకే ఒక ఆశ? ఎందుకు లేదు అతనికి వినాశము? - ఈ మూడు ప్రశ్నలకు సమగ్ర సమాధానమే సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ ప్రసాద బాబూజీ వారి మహదవతారం.

మాటి మాటికీ పుడుతూ, పెరుగుతూ, చస్తూ ఉండే ఈ పార్థివ శరీరము 'తాను'కాదని, సకల చరాచరాలను, సకల సృష్టిని ప్రకాశింపజేస్తూ, స్వయంగా ప్రకాశించే బ్రహ్మమే 'తాన'ని ఋజవు

చేసుకుని, ఆత్మానందంలో అనవరతమూ ఓలలాడే మానవుడే బ్రహ్మ జ్ఞాని. సకలమును తనలోనే చూసుకుంటూ, సర్వము తానే అయినట్టి ఆత్మ స్వరూపుడు. అతడు నిత్యుడు, సత్య స్వరూపుడు, అవ్యయుడు, గుణ రహితుడు.

"WHY FEAR? I AM HERE!" ఇది శ్రీ బాబూజీ మహరాజ్ వారి అభయవాక్యం.

**ఈశ్వరో గురురాత్మేతి మూర్తి భేద విభాగినే।**
**వ్యోమవద్వ్యాప్త దేహాయ తస్మై శ్రీ గురవే నమః॥**

భగవంతుడు, గురువు, ఆత్మ ఒకటే.

శ్రీ బాబూజీవారు అద్వైత ప్రబోధకులు. సగుణారాధకులుగా కనిపించినా, శ్రీవారి బోధలు అద్వైత ప్రధానములు. సగుణ విధానంలో దేవుని పూజించి, నిర్గుణ విధానంలో జ్ఞాన సిద్ధిని పొందమంటారు. శ్రీబాబూజీ. సగుణ, నిర్గుణ సమన్వయమే వారి బోధలలోని సారం. మనస్సు సన్యసించాలి. నిజమైన సన్యాసం మనస్సులో జరగాలి. అంతేగాని గృహ పరిత్యాగం కాదు.

శ్రీబాబు తరచుగా తమ ప్రసంగాలలో సత్సాంగత్యం యొక్క ప్రాముఖ్యత గురించి చెబుతారు. "సత్సంగం అంటే సత్య వస్తువుతో కలిసి ఉండటం. ఆధ్యాత్మిక సాధనకు సత్సంగం ఎంతో తోడ్పడుతుంది. గురువును ఆశ్రయించి, వారిని భక్తి ప్రపత్తులతో సేవించి, ఆత్మార్పణ చేసిన శిష్యుడు తప్పక తరిస్తాడు." అని శ్రీబాబు నొక్కి వక్కాణించారు.

విశ్వమతం : అజరం, అమరం అయిన ప్రేమ వాహినిలో కుల మత భేదాలకు తావు లేకుండా, గురుదేవులు అందరికీ స్థానం కల్పించారు. ఏ పేరుతో పిలిచినా దేవుడు ఒక్కడే. ప్రవక్తలందరూ ఈ సత్యాన్నే బోధించారు. చిత్త శుద్ధితో, విశ్వాసంతో , మార్గమేదైనా భక్తుడిని దేవుని వద్దకు చేరుస్తుంది. శ్రీ బాబు సర్వ మత సంధాతగా వారి విశ్వమతాన్ని ప్రపంచంలో నలుమూలలా బోధించారు. సార్వజనీయ ప్రార్థనను ప్రసాదించారు. శ్రీ బాబు కఠోర సిద్ధాంతాలను ఎప్పుడూ బోధించలేదు. సరళమైన, పవిత్రమైన ఆధ్యాత్మిక జీవితాన్ని గడపటం ద్వారా మానవులు జనన మరణ వలయం నుంచి ముక్తులు అవుతారు అని బోధించారు.

భగవంతుని బిడ్డలైన మానవుల మధ్య జాతి, నీతి, కుల, మత

భేదాలు, వైషమ్యాలు తొలగిపోవాలనీ, ప్రేమ దృష్టి, సమభావం పెరగాలి అని శ్రీబాబు విశ్వమతాన్ని ప్రవచించి, ఆచరించి చూపారు. "ఏ తీరున పిలచినా పలికే పరమాత్మ ఒక్కడే అని, మతం పేరిట కలహించేవారు హీనులని మతిగల మానవుడు మతం మార్చుకోనక్కరలేద"ని తెలిపారు. డిశంబర్ 1988 3వ, తేదీన శ్రీబాబు తమ పార్థివ శరీరాన్ని విడిచి చైతన్య రూపంలో శ్రీకాళీ గార్డెన్స్ లో బృందావన ప్రవేశం(సమాధి) చేశారు

శ్రీబాబు ఒడిలోనే పెరిగి, వారు అందించిన జ్ఞాన క్షీరాలను గ్రోలి, వారి ఆదేశానుసారం "యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారు శ్రీకాళీ గార్డెన్స్ ఆశ్రమ పీఠాధిపతిగా బాధ్యతలను స్వీకరించి, శ్రీబాబుజీ మహరాజ్ వారు స్థాపించిన విశ్వమత సిద్ధాంతాలను ప్రపంచమంతటా అవిరళ కృషి చేస్తూ చాటుతున్నారు.

ముగింపు

శ్రీమాతాజీవారు కల్పించిన మహదవకాశం వల్ల శ్రీస్వామి నారాయణ్ వారి అక్షరధామం(ఢిల్లీ) చూసినప్పుడు శ్రీబాబూజీ మహరాజ్ వారి బాల్య లీలలు, వారి అవతార విశేషాలు, వారి బోధలు మనస్సులో మెదిలాయి. అంతేకాదు ఈ ఇరువురు మహాత్ముల అవతార విశేషాలు మేలు కలయిక కలిగి ఉన్నాయన్నది నిర్వివాదాంశం.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

**మే 2019**

9 గురు - శ్రీ శంకర జయంతి - శ్రీసద్గురుపాదపూజ

18 శని - (శ్రీగురు) వైశాఖ పౌర్ణమి - శ్రీ సద్గురు పాదపూజ

29 బుధ - శ్రీగురుదశమి - హనుమజ్జయంతి - శ్రీసద్గురుపాదపూజ.

**జూన్ 2019**

17 సోమ - జ్యేష్ఠ పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

27 గురు - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

# వికారి నామ సంవత్సర విశిష్ఠత

- సుషుమ్నా ప్రసాద

మనం విళంబి నామ సంవత్సరానికి వీడ్కోలు చెప్పి, వికారినామ సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నాము. మన తెలుగువారు సంవత్సరాదిని ఉగాది అని కూడా పేర్కొంటారు. ఇది ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమి నాడు జరుపుకుంటాము. తెలుగువారి ఉగాది నాడే బ్రహ్మ సమస్త సృష్టిని ప్రారంభించాడని, వైకుంఠనాథుని దశావతారములలో ప్రథమమైన మత్స్యావతారాన్ని ధరించి, సోమకాసురుని సంహరించి, వేదములను కాపాడినది కూడా ఉగాది నాడేనని మన పురాణ గాథలు తెలియజేస్తున్నాయి. ఎంతో ప్రాశస్త్యం వున్న ఈ ఉగాదిని తెలుగువారు చైత్ర శుద్ధ పాడ్యమిని పర్వదినంగా జరుపుకుంటున్నారు.

ఇది వసంత ఋతువుతో ప్రారంభం అవుతుంది. మనం ఒక సంవత్సరాన్ని ఆరు ఋతువులుగా విభజించుకున్నాము. అందులో ప్రథమమైన వసంత ఋతువు అత్యంత విశిష్ఠమైనది. అందుకే శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత విభూతియోగంలో 'మాసానాం మార్గశీర్షోహం, ఋతూనాం కుసుమాకరః' (10/35 శ్లో ) అని ఉద్ఘాటించారు. అంటే మాసములలో మార్గశిరమును, ఋతువులలో వసంత ఋతువును నేనే అని అర్థము. ఆంగ్లేయులు కూడా **'Spring is the king of the seasons'** అంటారు. ఈ ఋతువులో ప్రకృతి ఫలపుష్పాదులతో, ఆకర్షణీయమైన వింత సోయగంతో, చిత్రవిచిత్రమైన శోభతో విరాజిల్లుతుంది. కాబట్టే ఈ మాసాన్ని చైత్రమాసం అన్నారు.

ఉగాది యుగాదికి పర్యాయ పదము. ఈ ఉగాది పర్వదినాన్ని ఉగాది ప్రసాదం (ఉగాది పచ్చడి) స్వీకరించడంతో ప్రారంభిస్తాము. ఉగాది ప్రసాదం షడ్ రుచులకు సంకేతం. వేపపువ్వు, లేత మామిడి ముక్కలు, బెల్లం, చింతపండు, ఉప్పు, కారంతో సమ్మిళిత మైనది. షడ్రసోపేతమైన భోజనం, షడ్రుచులతో లభించుగాక అని సూచిస్తున్నది. ఈ ఆరు రుచులు మన జీవితంలోని బాధ, సంతోషం, ఉత్సాహం, నేర్పు, సహనం, సవాళ్ళకు సంకేతాలు. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి, చెడులను, కష్టసుఖాలను ఒకేలా స్వీకరించాలన్న సందేశాన్ని చెప్పకనే చెబుతుంది ఉగాది పచ్చడి.

ప్రకృతి మార్పులకు అనుగుణంగా మన శరీరాన్ని సంసిద్ధం చేసే శక్తి ఈ ప్రసాదానికి వున్నదని పురాణోక్తి. ఉగాదినాడు పంచాంగ శ్రవణం పవిత్ర ప్రదేశాలలో తప్పక చేయాలని పెద్దలు చెబుతారు. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణమనే అయిదు అంగాల కలయికనే పంచాంగం అంటారు. పంచాంగ శ్రవణం వలన నాతోపాటు, నా ఊరు, నా దేశం, బాగుండాలనే గొప్ప సాంప్రదాయం దాగివున్నది. ప్రకృతిలోని మార్పులెంత సహజమో, జీవితంలోని కష్టసుఖాలు కూడా అంతే సహజమని చాటి చెప్పటమే ఉగాది పండుగ ముఖ్యోద్దేశం.

వాస్తవంగా కాలమనేది ఆద్యంతములు లేని ఒక అనంత ప్రవాహం లాంటిది. అంతర్ముఖంగా విచారించి చూస్తే, కాలచక్రములో బంధితుడైన మానవుడు ఆద్యంతములు లేని కాలాన్ని గణించడానికి చేసే ప్రయత్నం చాలా చిత్రంగా, హాస్యాస్పదంగా వుంటుంది. జనించి, గతించే యీ జగత్తులో పరిణామముతో కూడి, పరిమిత జీవితం గడిపే మానవుడు అనంతమైన కాలానికి హద్దులు కల్పించే ప్రయత్నం చేయడ మనేది మాయా ప్రభావానికి మచ్చుతునక లాంటిదని బాబూజీ మహరాజ్ వారు అనేక సందర్భాలలో చెప్పేవారు.

శ్రీవారు తమ బోధలలో 'కాలము నీతో ప్రారంభం కాలేదు, నీతో అంతం కావటం లేదు. కాలం చేతిలో కీలుబొమ్మయైన మానవుడు కాలానికి కూడా హద్దులు ఏర్పరుస్తున్నాననే భ్రమలో వున్నాడు. 'ప్రకృతి ఎంతో వైవిధ్యం, భిన్నత్వం కూడివున్న ఈ జగత్తులో సత్యమై నిత్యమైన ఏకత్వమును దర్శించడమే మానవజీవిత పరమావధి. బ్రహ్మసత్యం జగన్మిధ్య అనే సత్యం ప్రతి ఆధ్యాత్మిక సాధకుడు గ్రహించ వలసినదే. రూప రహితమైన కాలానికి కూడా నామాన్ని ప్రసాదిస్తున్నాడు మానవుడు. తెలుగు సాంప్రదాయం ప్రకారం 60 సంవత్సరాలను ఒక సైకిల్‌గా నిర్ణయించుకుని, ప్రభవ నామ సంవత్సరంతో ప్రారంభమయి, షష్ఠి పూర్తి కాగానే తిరిగి ప్రభవనామ సంవత్సరానికి వస్తాము. ఇలా కాలచక్రం పరిభ్రమిస్తూనే వుంటుంది.

ఈ 60 సంవత్సరాల కాలచక్రంలో కొన్ని సంవత్సరాల పేర్లు మనకి భయాన్ని కలిగింపజేస్తాయి. ఉదాహరణకు దుర్ముఖి, ప్రమాది, రాక్షస, వికృతి, వికారి మొదలైనవి. కాని కృష్ణభగవానుడు భగవద్గీతలో 'కాలం

కలయతామహం' అంటే కాలస్వరూపుడిని నేనే అని అభయమిచ్చారు. కాలం భగవత్స్వరూపం కాబట్టి గురుదేవుని ఆశ్రయించినవారికి సర్వదా శ్రేయస్సు, శుభమే కలుగుతుంది. కాలజ్ఞాన విదగ్రణియై, శుభప్రదమైన సద్గురుదేవుని పాదపంకజములను ఆశ్రయించిన వారు గురునామ స్మరణతో కాలాన్ని మహామహిమాన్వితం చేసుకోగలరు. అలా గురుస్మరణలో, గురుసేవతో పునీతులైన, ఆధ్యాత్మిక సాధకులకు కాలదోషమనేది దరిచేరదు. కాలదోషాన్ని హరింపజేసే కాశీప్రసాదదేవుడు తన అభయహస్త నీడలో నిరంతరం మనలను సంరక్షిస్తూనే వుంటాడు.

వికారి నామ సంవత్సరంలో మనకెలాంటి వికారాలు సంభవిస్తాయో అని సందేహించనవసరం లేదు. ఆధ్యాత్మిక సాధకులైన గురుపుత్రులకు వికారములన్నిటినీ రూపుమాపి, విశ్వేశ్వర దర్శనం చేయించే సమర్థుడైన గురు విశ్వనాథుని అభయహస్త నీడలో సదా వర్థిల్లుతాము. త్రికాలజ్ఞుడైన మన సద్గురుమూర్తి మనలోని షడ్వికారములకు (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు) వీడ్కోలుచెప్పి, తన్నాశ్రయించిన భక్తులందరిని, వినయ భూషణులుగా తీర్చిదిద్ది, విజ్ఞతను, వివేకమును ప్రసాదిస్తారు.

కనుక మనం ఉగాది ప్రసాదం స్వీకరించి, షడ్వికారములకు స్వస్తి చెప్పి, సదసద్వివేకమును ప్రసాదించే సద్గురుదేవుని అనుంగు బిడ్డలుగా వర్థిల్లాలని ఆశిద్దాము. ఈ వికారి నామ సంవత్సరం సద్గురు మూర్తి యందు అచంచల విశ్వాసమున్న భక్తులకు వివేకానందమును ప్రసాదించే విజయ వర్షిణిగా ప్రకాశిస్తుంది. నూతన వసంత శోభతో, నిత్యానంద కుసుమాల పరిమళంతో, ఆదర్శ వర్షంగా మనందరిని అలరింప జేస్తుందని విశ్వసించి తరిద్దాం.

# భక్త షేక్. ఫరీద్

- మురళీ

శ్రీనాధుడు, నీళోబాయి దంపతులు అన్యోన్య ప్రేమానురాగాలతో జీవితం గడిపేవారు. నీళోబాయి తన భర్తనే పరమ దైవముగా భావించి సేవించటమే కాక, అత్తమామలను కూడా గౌరవముగా సేవించేది. ఆ దంపతులకు లేకలేక ఒక కుమారుడు కలిగాడు. అతనిపేరు షేక్. ఫరీద్. ఎంతో ప్రేమతో పెంచుకోసాగారు. పిల్లవాడికి మూడవ సంవత్సరం వచ్చింది. ఒకరోజు శ్రీనాధుడు తోటలో పూలు కోస్తుండగా అతనిని నాగుపాము కరిచింది. అతడు అలాగే హరిని ధ్యానిస్తూ ఇంటికి వచ్చి, స్నానం చేసి, దేవతార్చన పూర్తిచేసి, తీర్థం తీసుకుని, తన భార్యను పిలచి తీర్థమిచ్చి, 'నన్ను పాము కరిచింది. నాకు శ్రీహరి సన్నిధికి చేరే సమయం ఆసన్నమయింది. మన కుమారునికి శ్రీహరియే ఇక రక్ష. వానిని జాగ్రత్తగా పెంచుకో' అని చెప్పి పరమపదించాడు.

షేక్ఫరీద్ అయిదవ సంవత్సరంలోనే హరిభజన చేస్తుండేవాడు. 12వ ఏడు రాగానే అతనిలో శ్రీహరిని దర్శించాలనే కుతూహలం కలిగింది. ఒకరోజు అతడు తన తల్లిని సమీపించి, 'అమ్మా! దేవుని దర్శించాలనే కోరిక నన్ను బాధిస్తున్నది. తగిన మార్గాన్ని నాకు చూపించు' అని అడిగాడు. అప్పుడు నీళోబాయి తన పుత్రుడితో 'భగవంతుని చేరటానికి అనేక మార్గాలు వున్నాయి. వ్రతములు ఆచరించుట, యోగాభ్యాసము చేయుట, యజ్ఞయాగాది క్రతువులు చేయుట, తపస్సు చేయుట, సత్యగురుదేవుని ఆశ్రయించి వారి అనుగ్రహముతో దేవుని దర్శించవచ్చు. వీటిలో నీకు ఏ మార్గము తగినదిగా వున్నదో ఆలోచించుకుని దానిని ఆచరించు' అని చెప్పినది.

తల్లి అనుమతితో షేక్ఫరీద్ తపస్సు చేయడానికి అరణ్యమునకు వెళ్ళాడు. సెలయేటి ప్రక్కనే వున్న ఒక మహావృక్షం క్రింద కూర్చుని నిత్యము తపస్సు చేయసాగాడు. అక్కడి ఆకులు, ఫలములు కోసుకుని తింటూ, నీరు త్రాగుతూ 12 సంవత్సరములు తపస్సు చేశాడు. కానీ దైవ దర్శనం లభించలేదు. అతడు తిరిగి తన తల్లి వద్దకు వచ్చి 'నాకు దైవ దర్శనము కాలేదు ఇంతవరకూ. దానికి కారణమేమిటి?' అని తల్లిని ప్రశ్నించాడు. అతని తల్లి అతని జటలను పట్టుకుని లాగింది. అతడు బాధతో 'అబ్బా!

నొప్పిగా వున్నది' అన్నాడు. వెంటనే తల్లి 'నీ జడలను లాగితేనే నొప్పి అన్నావు కదా! మరి చెట్ల నుండి ఆకులు ఫలములు కోసి తింటే వాటికి నొప్పిగా వుండదా? అలా జీవ హింస చేస్తే మరి దైవ దర్శనం ఎలా కలుగుతుంది?' అని అడిగింది.

తన తల్లి మాటల అర్థాన్ని గ్రహించిన షేక్ఫరీద్ తిరిగి అరణ్యానికి వెళ్ళి, చెట్లక్రింద రాలిన పండ్లను ఆకులను భుజిస్తూ తపస్సు ఆచరించాడు. అయినప్పటికీ అతనికి శ్రీహరి దర్శనం కాలేదు. అప్పుడతడు తలక్రిందులుగా వ్రేలాడుతూ, నిరాహారుడై తపస్సు చేస్తూ, భగవంతుని ధ్యానించాడు. అతని దేహము జీర్ణించిపోయింది. అప్పుడు పక్షులు అది శవముగా భావించి, పొడిచి తినసాగినవి.

షేక్ఫరీద్ 'భగవానుడా! నీకు నాపై ఏల కనికరము కలుగట లేదు? నా తపస్సు కలుషభూయిష్ఠమైనచో నాకు సన్మార్గమును చూపించు. నేను నీ దర్శనమును తప్ప మరేదీ కోరను' అని ఆర్తితో ప్రార్థించాడు. అప్పుడు శ్రీ మన్నారాయణుడు ప్రత్యక్షమై, 'నాయనా! నీ అచంచల తపస్సుకు మెచ్చాను. నీ తపస్సులో ఏ లోపమూ లేదు. కాని, నీవు ఒక సద్గురువును ఆశ్రయించి, ఉపదేశము పొంది, నన్ను ధ్యానించి, తరించు' అని చెప్పి అంతర్ధానం అయ్యాడు. షేక్. ఫరీదు ఇంటికి తిరిగి వెళ్ళి తన తల్లితో నారాయణుడు చెప్పినదంతా చెప్పి ఆమె అనుమతి కోరాడు.

- సశేషం

ఒకే బంగారంతో రకరకాల పేర్లు, రూపములు గల నగలు చేయబడినట్లే; ఒకే దేవుడు వేరువేరు దేశములలో వేరువేరు కాలములలో, వేరువేరు రూపములతో పూజింపబడుతుంటాడు. కొందరు తండ్రిఅని, కొందరు తల్లిఅని భిన్నభిన్న భావాలతో అతనిని పూజిస్తూ ఉంటారు. ఇన్ని రూపనామభావములతో పూజింపబడు ఆ భగవంతుడు మాత్రం ఒక్కడే!

- శ్రీ రామకృష్ణ పరమహంస

## శ్రీ బాబూజీ మహరాజ్ అనుగ్రహముతో
## శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి పర్యవేక్షణలో జరుగనున్న 'హరేరామ నామ సంకీర్తన, సత్సంగ సప్త సప్తాహాలు'

పైన వివరించిన కార్యక్రమాలు శ్రీఅన్నవరం శ్రీ సత్యదేవుని సమక్షంలో ప్రారంభమై, పంచారామాలలో సప్తాహములు చేసుకుని చివరిగా శ్రీకాళీవనాశ్రమంలో సంపూర్ణం చేయబడతాయి. ఈ విషయం భక్తులందరికి కరపత్రములు (పేంప్లెట్స్) ద్వారా తెలియపరచటమైనది.

కార్యక్రమ వివరములు : తె జా 4 గం.లకు సుప్రభాతం; 4గం 30 ని.లకు ప్రార్థన; 9గం.లనుండి 10 గం.ల వరకు శ్రీశ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనము;11 గం.లకు మరియు సాయంత్రం 6 గం.లకు శ్రీ మాతాజీ మరియు మహాత్ముల అభిభాషణము ఉంటాయి. ఈ సప్తాహాలలో అఖండ హరేరామ నామ సంకీర్తన శ్రీ శివాజీ, కామేపల్లివారి ఆధ్వర్యంలో జరుగును.

సప్త సప్తాహముల వివరములు : 1. ది.23.3.2019 నుండి ది,30.3.2019 వరకు అన్నవరం శ్రీ సత్యన్నారాయణ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ; ***2. ది. 24.04.2019 నుండి ది. 01.05.2019 వరకు చాళుక్య కుమారారామం, శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత భీమేశ్వర స్వామి, సామర్లకోట;*** 3, ది. 20.05.2019 నుండి ది.27.05.2019 వరకు భీమారామం, మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం ద్రాక్షారామం ; 4. ది.05.08.2019 నుండి ది.12.08.2019 వరకు సోమారామం, ఉమాసోమేశ్వర జనార్థనస్వామివార్ల దేవస్థానం భీమవరం; 5. ది.08.09.2019 నుండి ది.15.09.2019 వరకు క్షీరారామం, శ్రీ పార్వతీ సమేత క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, పాలకొల్లు; 6.ది.18.10.2019 నుండి ది.25.10.2019 వరకు అమరారామం, శ్రీ బాలా చాముండేశ్వరి సమేత శ్రీ అమరేశ్వరస్వామి ఆలయం ప్రాంగణం అమరావతి; మరియు 7. ది.15.11.2019 నుండి ది.22.11.2019 వరకు శ్రీగురు ఆరామం, శ్రీ కాళీవనాశ్రమం (నంబూరు)లో నిర్వహించబడును.

భక్తులందరూ బహు సంఖ్యాకంగా విచ్చేసి, ఈ కార్యక్రమాలను జయప్రదం చేయమని ప్రార్థిస్తున్నాము. భారీ ఎత్తున జరిగే ఈ కార్యక్రమాలు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడినవి. కావున భక్తులు ఈ విషయాన్ని గుర్తించి, ధన రూపంలోను, అమూల్యమైన సేవలరూపంలోను తమ సహాయ సహకారాలను అందించమని భక్తులను ప్రార్థిస్తున్నాము. భక్తులు ఇచ్చే విరాళాలకు ఐ.టి యాక్ట్ 80 జి రాయితి లభిస్తుందని తెలియజేస్తున్నాము.

పూర్తి వివరాలకు ట్రస్ట్ ఆఫీస్ 0863 - 2293564;

కె.మురళీమోహన వర్మ సెల్ - 93983 34345 మరియు

కుమార స్వామి రాజా సెల్ - 93465 35357లను సంప్రదించగలరు.

# నచికేతుడు

- పరాశర ప్రసాద్

వాజశ్రవుని కుమారుడైన వాజశ్రవసుడు విశ్వజిత్ యాగాన్ని నిర్వహించి, ఆ యాగానంతరము ఋత్విజులకు యజ్ఞాంత దక్షిణగా గోవులను దానం చేయనారంభించాడు. తనకున్న గోసంపద అంతటిని దానం చేయవలసినదే. అది ఆ యాగ నియమం. వాజశ్రవసునకు నచికేతుడు అనే బుద్ధిశాలి, గుణశాలి అయిన కొడుకు వున్నాడు.

తండ్రి దానం చేసే గోవులలో శక్తి హీనమైనవి, ఇంద్రియ పటుత్వం లేనివి, నిస్సారాలయిన గోవులు అనేకం వున్నాయి. వాటిని చూసిన నచికేతునకు బాధ కలిగింది. అటువంటి దానం చేసినవారెవరైనా సుఖ ప్రాప్తిలేని దుర్గతి కలుగుతుంది అనే స్మృతి వాక్యం అతనికి జ్ఞాపకం వచ్చింది. వెంటనే ఆవేదనతో నచికేతుడు తండ్రిని ఉద్దేశించి మాట్లాడుతూ, 'ఈ యాగంలో నీ సర్వస్వాన్ని దానం చెయ్యాలి కదా! నన్ను ఎవరికి ఇస్తావు?' అని అనేకమార్లు ప్రశ్నించాడు. మొదటి రెండు సార్లు మౌనం వహించిన తండ్రి విసుగుచెంది, మూడవసారి సమాధనం చెబుతూ 'నిన్ను యమధర్మరాజుకు దానం చేస్తాను' అన్నాడు.

అలా నోరు జారినందుకు తండ్రి వ్యథ చెందినప్పటికీ నచికేతుడు తండ్రి మాట నెరవేర్చటమే తన ధర్మంగా భావించి యమపురికి ప్రయాణమై వెళ్ళాడు. ఆ సమయంలో యమపురిలో యమధర్మరాజు గృహంలో లేని కారణంగా, నచికేతుడు నిరాహారిగా ఆ గృహం వెలుపలే వేచియున్నాడు.

యమధర్మరాజు ఇంటికి రాగానే, ఆ విషయం తెలుసుకుని ధర్మానికి రాజైన యముడు తన ఇంట జరిగినదానికి చింతించి, తాను అపరాధానికి ప్రాయశ్చిత్తంగా నచికేతునికి నమస్కరించి, తన నిరాదరణకు క్షమించమని ప్రార్థించి మూడు రోజులు నిరాహారిగా వున్నందుకు మూడు వరాలు ఇవ్వడానికి సిద్ధపడ్డాడు.

యమధర్మరాజు ఔదార్యానికి సంతోషించిన నచికేతుడు, మొదటి వరంగా - తాను ఇంటికి వెళ్ళగానే, తన తండ్రి తనను గుర్తించి, క్రోధాన్ని విడిచిపెట్టి, ఎట్టి అపనమ్మకము లేకుండా తనను స్వీకరించాలని కోరుకున్నాడు. యమధర్మరాజు దానికి అంగీకరించాడు.

రెండవ వరంగా - ఆకలిదప్పులు, వార్ధక్యము, దుఃఖము, మృత్యు భయము లేని స్వర్గలోక ప్రాప్తికి అగ్ని విద్యను తనకి తెలియజేయ మన్నాడు. అతి గుహ్యమైన అగ్ని విద్యను యమధర్మరాజు నచికేతునకు వివరంగా తెలియజేశాడు. నచికేతుని ధారణ శక్తికి యముడు ఆశ్చర్యపోయాడు. అంతేకాదు ఈ విద్యద్వారా నీవు పునర్జన్మ లేని స్థితిని పొందెదవుగాక! అని వరమిచ్చాడు.

ఇంకా నచికేతుడు మూడవ వరంగా - ఆత్మవిద్యను పొందే మార్గాన్ని తెలియజేయమని కోరుకున్నాడు. యమధర్మరాజు ఆత్మవిద్య అర్హులకు, యోగ్యత కలవారికే తెలియజేయాలి అందువల్ల ఆ కోరికను మాని, ఎన్నో విధాలుగా భూలోకంలో లభించే సౌకర్యాలన్నీ ప్రసాదిస్తానని ప్రలోభ పెట్టాడు. కాని అశాశ్వతమైన ప్రాపంచిక విషయాదులను నచికేతుడు తిరస్కరించాడు.

భోగభాగ్యాలను, సంపదలను, ధనధాన్యాలను, దీర్ఘ ఆయుర్దాయాన్ని తిరస్కరించి, ఆత్మ జ్ఞానాన్నే కోరుకున్నాడు. నచికేతుని ప్రాపంచిక సుఖాలపై గల విరక్తిని, ఆత్మజ్ఞానంపై గల ఆసక్తిని, జిజ్ఞాసని గమనించిన యముడు జ్ఞానోపదేశము చేయ ప్రారంభించాడు.

- సశేషం

**పడవ నీటిలో ఉండవచ్చు,**
**కానీ నీరు పడవలో ఉండరాదు.**
**అలాగే**
**సాధకుడు సంసారంలో వుండవచ్చు,**
**కానీ సంసారాసక్తి అతనిలో ఉండరాదు.**

- శ్రీ రామకృష్ణ పరమహంస

# కోఽహం

-రమణ ప్రసాద్

(శ్రీ మాతాజీ ప్రసంగాల నుండి)

'కోఽహం?' అంటే ఒకావిడ 'నాఽహం' అన్నది. ఆయన 'సోఽహం' అన్నాడు. తత్త్వమంతా ఇందులోనే ఉంది. కోఽహం అనే భావనను అందించే వాడెవరో తెలియటం లేదు. కాని అందించినంత అందుకుంటున్నాము. తృప్తి పడుతున్నాము. ఈ జీవితాన్ని అందించిన వారే ఆయన. ఆయన ఎవరు అంటారా? ఇంకెవరు? శ్రీ గురుదేవులు. సుఖానికి వ్యతిరేకపదం దుఃఖం. కాని ఆనందానికి వ్యతిరేక పదం లేదు. కేవలం ఆనందమే. 'ఆనందో బ్రహ్మ' అంటున్నాయి ఉపనిషత్తులు. ఆనందం రావాలంటే విచారణ చేయ్యాలి. అంటే నీకు నువ్వు 'నేను ఎవరు?' అని ప్రశ్నించుకోవాలి. ప్రశ్న వుంటే సమాధానం ఉంటుంది. లడ్డూలు తింటే ఆనందమే. కాని మితిమీరి తింటే దుఃఖమే. ప్రపంచంలో మనం పొందే ఇటువంటి తాత్కాలిక ఆనందాలకు కారణం ఎవడు? ఎవడు మనలో ఉండి మనం తిన్నవాటి రుచులు తెలియజేస్తున్నవాడు.

ఈ శరీరం ఒక యంత్రం. దీనిని నియంత్రించేవాడు ఎవడు? మనం ఇప్పుడు భాగవత శ్రవణం చేశాం. గోకులంలో గోపి గోపాలకులు ఎటువంటి ఆనందాన్ని పొందారో అట్టి ఆనందాన్ని పొందాం. ఇది అందించిన శుకుడు ఎంత గొప్పవాడోకదా!.

మనకు ఈ భాగ్యాన్ని అందించిన శ్రీ గురుదేవులు ఎంత గొప్పవారో అది ఆలోచనకు అందని విషయం. గురు శక్తి నీకు భిన్నంగా లేదు. అది నీలోనే ఉన్నది. నీవై ఉన్నది. దానిని అనుభవానికి రాకుండా చేసేదే మాయ. మనం శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి లైన్‌లో నుంచొని ఉన్నాం. ముందు ఒక సినిమా యాక్టర్ లైన్‌లో ఉన్నాడు. మన దృష్టి అటే ఉంటుంది. కాని మనం వెళ్ళింది స్వామి దర్శనానికి అన్న విషయాన్ని విస్మరిస్తాం. అవే పూర్వ వాసనలు. నువ్వు లేకపోతే ఈ ప్రపంచం ఎక్కడిది? నీ ఇంద్రియాలకు శక్తినిచ్చి నడిపేవాడు ఎవడు? దీనికి శ్రీ గురుదేవులు ప్రసాదించిన ఈ కీర్తన. ఇది మనకి గురుగీత ఉపనిషత్సారము.

" ఎవని కృపచే వినును కర్ణములు నాదమును
ఎవని కృపచే చూచును విస్మయమును
ఎవని కృపచే పలుకును అమృత రసన
ఎవని కృపచే కర చరణములు కదలును
ఎవని కృపచే పరమగతి లభించును
అట్టి ప్రభుని త్యజించి వేరొకనియందు లగ్నమగుటేల?
గురుకృపచే మనసా మేలుకొనుము..."

మన కన్ను చూస్తోంది. చెవి వింటోంది. అది ఎవరి కృప? మనం ఎంత సేపు ప్రపంచ విషయాల గురించి ఆలోచిస్తూ మనలను తరింప జేసే మన ప్రభువుని (శ్రీ గురుదేవులను) విస్మరిస్తున్నాం. ఆయన మాట్లాడే దేవుడు. మన ఉనికికి కారణం వారే. వారు మనని 'accept' చేశారు. WHY FEAR? I AM HERE! అని అభయం ఇచ్చారు. అది అనుకోవటం కాదు. దానిని అనుభవించాలి. మనలో ఉండి మనలను నడిపించే దేవుడే అంతటా ప్రకాశిస్తున్నాడు అన్న సత్యాన్ని గుర్తించాలి.

అందుకనే ప్రశ్న రావాలి. డా॥ రామచంద్రరాజుగారు శ్రీబాబుని ఇలా ప్రశించేవారు. బాబూ! జనక మహారాజు రికాబులో కాలు పెడ్తుంటే... (అని అందించినట్లుగా).శ్రీ బాబు దానికి స్పందిస్తూ.." జనక మహారాజు అధికారి అయ్యాడు కాబట్టి అష్టావక్ర మహాముని అందించాడు. జనకునికి కూడా ప్రశ్న వచ్చింది. రికాబులో కాలు పెట్టగానే జ్ఞానం రావాలి అని చాటింపు వేయించాడు. అష్టావక్రముని ముందుకు వచ్చాడు. అష్టావక్రుడు ఒక గుఱ్ఱాన్ని తెప్పించాడు. జనక మహారాజు రికాబులో కాలు పెట్టబోతుండగా,"ఆగు రాజా ఆగు! ఉపదేశం అందుకునేముందు గురు దక్షిణ ఇవ్వాలి కదా!" అన్నాడు. "మీ ఆజ్ఞ" అన్నాడు రాజు. "నీ తను మన ధనాలను నాకర్పించు" అన్నాడు అష్టావక్రుడు. అష్టావక్రుడు వెళ్ళిపోయాడు. అంతే రాజు కాలు రికాబు పైనే ఉండిపోయింది. మాటా మంతీ లేదు. ఆ మునీశ్వరుడు ఈయనను ఏదో చేశాడు. అని వెదకటానికి వెళ్ళారు భటులు. ఆయన వారికి అందుబాటులోనే ఉన్నాడు. ఆయన వచ్చి,"రాజా!" అనగానే, "చెప్పండి స్వామీ!" అన్నాడు రాజు. అక్కడ ఏమైంది? అది ఒక దివ్యానుభూతి. మాటలతో చెప్పేది కాదు.

అలాగే మనకి కూడా ప్రశ్న ఉద్భవించాలి. అంతేగాని గొఱ్ఱెలమంద లాగా ఎవరు ఏది చెబితే విని తలలూపటం కాదు. మనలో ఉన్న సత్యాన్ని మనకి గుర్తింప చేయాలన్నదే వారికున్న ఆశ. ఈ శరీరం ఒక అద్దె కొంప. శరీరం ఉన్నంత వరకు కర్మ వుంటుంది. కర్మ ఉంటే జన్మ తప్పదు. కర్మ తీరిపోతే జన్మకు రాము. కర్మ రహితం కావాలంటే గురుకృప ఉండాలి. మన ప్రభువుని మనం ప్రార్థించాలి - "ప్రతి భావనలో నిన్ను గుర్తించే అనుభవం కలిగేటట్లు చెయ్యి ప్రభూ! నిన్ను గూర్చే ఆలోచనలు నాలో కలిగేటట్లు చేయి ప్రభూ!" అని. మనకోసమే వారు అవతారం ధరించి వచ్చారు. వారి అనుగ్రహం చేతనే మనం జీవనం సాగిస్తున్నాం. వారి అనుగ్రహంలో ఉన్నాం. ప్రయత్నం చెయ్యాలి. ప్రయత్నం చేస్తే తన ఇంటికి (ధామానికి) తాను చేరుకోగలుగుతాడు. కాబట్టి శ్రీగురుదేవులు మనందరికి అటువంటి శక్తిని, భక్తిని, సాధనా సంపత్తిని ప్రసాదించెదరు గాక! సుభీభవ! సుఖీభవ!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, గూడూరి వెంకట సుబ్బమ్మగారు (లంకా శేషగిరిరావుగారి పెద్దకుమార్తె) 20-4-2019 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 81సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## వేసవిలో శిక్షణా తరగతులు

1-5-2019 నుండి 31-5-2019 వరకు శ్రీకాళీగార్డెన్స్ నంబూరులో చిన్నపిల్లలకు వేసవి శిక్షణా తరగతులు ప్రార్థన, భగవద్గీత, ఉపనిషత్తులు మొదలగు అంశాలలో నిర్వహింప బడుతున్నాయి. ఆసక్తి గల తల్లిదండ్రులు విషయాన్ని గమనించి, సద్వినియోగ పరచుకోగలరు!

వివరములకు డా.అరుణ. సెల్ నం. 93463 82563

## గురు భక్తి విశేషము - గాలి జగదీశ్

ఒక బ్రహ్మచారి, వైరాగ్యసంపన్నుడయిన ఒక బ్రాహ్మణుడు ఉపదేశం పొందాలనే నిశ్చయ బుద్ధితో, ఒక సద్గురువును ఆశ్రయించి, ఆయనకు సేవలు చేస్తూ వుండేవాడు. అలా అనేక సంవత్సరాలు గడచి పోయాయి. ఒక రోజు గురుశిష్యులిద్దరూ ఒక అరణ్యం గుండా ప్రయాణం చేస్తున్నారు. మధ్యలో గురువుగారికి విపరీతమైన దాహం, అలసట కలిగాయి. ఒక చెట్టు క్రింద కూర్చుని, శిష్యుణ్ణి దగ్గరలో ఏదైనా తటాకం వున్నదేమో చూసి కాసిని మంచినీరు తీసుకు రమ్మనమని చెప్పి పంపించాడు. శిష్యుడు నీటికై వెళ్ళాడు. కాని ఇంతలో గురువుగారికి తన శిష్యుడు తిరిగి వచ్చేలోపే తన ప్రాణం పోబోతున్నట్లుగా తెలుసుకుని, అయ్యో! తన శిష్యుడు ఎంతకాలం నుండో ఉపదేశం కోసం ఎదురు చూస్తున్నాడు కాబట్టి అతనికి వెంటనే ఉపదేశం ఇవ్వాలని నిశ్చయించుకుని, తన ప్రక్కనే నేలమీద ఒక మంత్రాన్ని వ్రాసి, అక్కడే దగ్గరలో గాడిదలు మేపుకుంటున్న ఒక దొమ్మరిదానిని పిలచి, చూపించి ఈ విషయం తన శిష్యుడికి తెలియజేయమని ప్రాధేయపడి, ఆ గురువుగారు తన ప్రాణాలను వదిలిపెట్టారు.

ఆ దొమ్మరి ఆ అక్షరాలు గాలికి చెరిగిపోతాయేమో అని భావించి, వాటిని ఒక తాటియాకు మీద వ్రాసుకుని, ఆ తాటి ఆకులను తన చెవులకు కమ్మలుగా ధరించి, నేలమీద వున్న ఆ అక్షరాలను చెరిపివేసింది. ఇంతలో ఆ శిష్యుడు నీటితో తిరిగి వచ్చాడు. అతనికి రాగానే దొమ్మరి ఆ జరిగిన విషయమంతా చెప్పింది. కానీ అతనికి మాత్రం ఆ తాటియాకులు ఇవ్వకుండా తనకు సేవ చేస్తూ జీవితం గడిపితే అవి ఇస్తానని చెప్పింది. ఆ శిష్యుడు ఆ మాటలు విని, తన గురువుగారి దగ్గర ఉపదేశం తాను ఎలాగైనా పొందాలనే ఆశతో ఆమె చెప్పిన మాటలకు అంగీకరించి, ఆమె దగ్గర వుండిపోయి ఆమెకు సకల సేవలు చేస్తూ, తీరిక సమయాలలో దగ్గరలో వున్న గ్రామాలలో భిక్షమెత్తుకుని జీవించసాగాడు. ఆమె ఎక్కడకు వెడితే అక్కడకు ఇతను కూడా వెళ్ళి ఆమెకు సేవచేస్తూ వుండేవాడు.

ఇలా ఉండగా ఒకసారి ఆ దొమ్మరి గుంపు వాళ్ళంతా కలసి ధర్మరాజు చేసే రాజసూయ యాగం పరిసరాలలో విడిది చేశారు. ఈ శిష్యుడు కూడా ఆమెతో పాటు కలసి అక్కడికి చేరాడు. ఒకరోజు ఆ బ్రాహ్మణుడు ఆమె గాడిదలు కాస్తున్నప్పుడు విపరీతంగా దాహం వేసి,

యాగశాలకు సంబంధించిన వంటశాల నుండి ఏరులాగా ప్రవహిస్తున్న గంజికాల్వ నుండి నాలుగు దోసిళ్ళ గంజి ఎత్తుకుని త్రాగి తన దాహాన్ని తీర్చుకున్నాడు. అప్పుడు అక్కడ యాగశాలలో లక్షమంది భోజనాలు చేశాక ఒక్కసారి గంట మ్రోగేటట్లుగా ఏర్పాటు చేశారు. ఆ గంట తనంతట తానుగా విడువక గణగణ మంటూ మ్రోగసాగింది.

అప్పుడు ధర్మరాజు ఇన్ని లక్షలమంది బ్రాహ్మణులకు ఒక్కసారిగా సంతర్పణ ఎలా జరిగింది? అని ఆశ్చర్యపోతూ నారదమహర్షిని ప్రశ్నించాడు. చిరునవ్వుతో నారద మహర్షి దానికి సమాధానం నీకు తరువాత చెబుతానుగాని, ముందు నువ్వు ఆ దొమ్మరి ఆట పెట్టించు వెంటనే అన్నాడు. దానికి తగిన ఏర్పాట్లు చేసి, ఆ దొమ్మరి ఆట ఆడుతున్నప్పుడు రెండు బంగారు చెవికమ్మలు తెప్పించి, ఆమె చూసేటట్లుగా వాటిని విసరి, అవి ఆమె ఆటలో వున్నప్పుడే చెవికి పెట్టుకోవాలని చెప్పాడు. దానికి ఆమె సంతోషంతో అంగీకరించి, ఆట మధ్యలో తన తాటియాకు కమ్మలు తీసి క్రిందపడవేసి, ఈ బంగారు వాటిని ధరించింది. అదే సమయంలో వాటికోసమే ఎదురు చూస్తున్న ఆ బ్రాహ్మణ శిష్యుడు తన గురువుగారు తనకు ప్రసాదించిన ఉపదేశం వున్న ఆ తాటికమ్మలు తీసుకుని ఆ చోటు విడిచిపెట్టి వెళ్ళిపోయాడు.

సర్వజ్ఞుడయిన నారద మహర్షి ఆ విషయాన్ని గమనించి, ధర్మరాజును తీసుకుని నదీతీరం వద్దకు వెళ్ళాడు. అక్కడ ఆ బ్రాహ్మణుడు ఆ తాటియాకు కమ్మను పట్టుకుని శ్రద్ధగా చదువుతున్నాడు, ఇంతలో అతని ప్రాణములు అనంతవాయువులో కలసిపోయాయి! అప్పుడు నారదమహర్షి అతని వృత్తాంతమంతా తెలియజెప్పాడు. ఆ బ్రాహ్మణుడే నిన్న గంజిగుంటలో గంజి త్రాగినది. నాలుగు దోసిళ్ళ గంజిలో ఎన్ని బిందువులు వుంటాయో అన్ని లక్షలమంది బ్రాహ్మణులకు సంతర్పణ జరిగిన దానితో సమానమైనది కనుకే ఆ గంట అలా విడువకుండా మ్రోగినది. ఆ బ్రాహ్మణుడికి ఇంత మహత్యం అతనికి అతని గురువు ఎడల కలిగిన భక్తివలన, గురు సేవవలన, ఆ గురూపదేశం పొందాలనే ఆవేదన, ఆ గురూపదేశ వాక్యం లభింపజేసుకోవాలనే శ్రద్ధ వలననే లభించింది. అంతటి శ్రద్ధ తపన వుండబట్టే ఆ గురూపదేశ వాక్యం లభించగానే అతని ఆత్మ పరమాత్మలో ఐక్యం అయిపోయింది - అని నారద మహర్షి ధర్మరాజుకు వివరంగా తెలియజేశాడు. ధర్మరాజుచేత ఆ బ్రాహ్మణునికి అంత్యక్రియలు జరిపించాడు.

## కర్మ - గడ్డం

- కీ.శే దాసరి దేవళ్ళు

1960లో శ్రీకాళీ జయంతులు వైభవంగా జరుగుతున్న రోజుల్లో నేను శ్రీబాబు దర్శనార్థం వెళ్ళాను. ఉత్సవాల హడావిడిలో తీరుబడి లేక నేను గడ్డం చేసుకోలేదు. 'శ్రీబాబు పాదపద్మాలను తాకుతూ నమస్కరిస్తున్న సమయంలో శ్రీబాబు నావైపు చూసి నవ్వుతూ 'దేవళ్ళూ! గడ్డం చాలా బాగుంది. అది అలానే వుంచుకో' అన్నారు. సద్గురుమూర్తి ఆజ్ఞ శిరసా వహించవలసినదే కదా! జయంతులు అయిపోయాయి. హడావిడి ముగిసింది. అయినా నన్ను గడ్డం తీయించమని బాబు చెప్పలేదు. కొంతకాలం ఇలానే గడిచిపోయింది.

శ్రీబాబు ఎక్కడెక్కడో తిరిగి వచ్చి, గుండుగొలను చేరారని తెలిసి, ముఖ్యంగా ఆయనను గడ్డం సంగతి అడుగుదామని బయలుదేరి వెళ్ళాను. వెళ్ళగానే అక్కడ శ్రీబాబు దర్శనం అయింది. ఆపైన ఎన్నో విషయాలను సావకాశంగా చాలాసేపు ముచ్చటించారు. నేను అన్నీ వివరంగా చెప్పాను. ఇహ అడగవలసినదీ, వినవలసినదీ కూడా ఏదీ లేదన్నట్లుగా శ్రీబాబు నన్ను 'సరే! ఇహ వెళ్ళిరా!' అన్నారు. అలాఅని శ్రీబాబు గదిలోకి వెళ్ళి తపులు వేయడం, నేను కాలు బయట పెట్టడం జరిగాక, ఏదో చెప్పటం మర్చిపోయాను సుమా! అనుకుంటూ గడ్డం గోక్కుంటుంటే, బాగా పెరిగిన గడ్డం చేతికి గుచ్చుకుంటుంటే అప్పుడు గుర్తు వచ్చింది గడ్డం సంగతి!

రోజురోజుకూ గడ్డం గురించిన ఆలోచనలు, గడ్డం కూడా బాగా పెరిగిపోతుంటే చాలా విసుగు, చిరాకు మొదలయింది భరించలేకపోతున్నాను. ఒక్కసారి బాబు దర్శనం అయితే బాగుండు ఈ గడ్డం సంగతి తేల్చుకుంటాను అని అనుకున్నాను. నా ప్రార్థన వినిపించిందా అన్నట్లుగా బాబు తుని మీద నుండి వైజాగ్ వెడుతున్నట్లు తెలిసింది. బాబు దర్శనంతో బాటు స్వార్థం కూడా ఎక్కువైనందున గబగబా తుని రోడ్డుమీదకు వెళ్ళాను. శ్రీబాబుకి బాగా తెలుసు, ఎప్పుడు, ఎక్కడ, ఏ గుణాన్ని, ఎలా అణచివేయాలో! తునిలో దిగడం మాట అలా వుంచి, వైజాగ్‌లో అన్నా కలుద్దామని ప్రయాణమై వెళ్ళిన నాకు అందకుండా తానే కలకత్తా వెళ్ళిపోయారు. నా గడ్డం సంగతి ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది.

ఇంతలో నవరాత్రి ఉత్సవాల సమయం వచ్చింది. అంతకుముందే

నా భార్యకు జబ్బు చేయటం, కలకత్తాలో వున్న శ్రీబాబుకు టెలిగ్రాం ద్వారా తెలియజేయటం జరిగింది. భవరోగాన్ని హరింపజేసే గురుదేవుడికి దైహికమైన రోగాన్ని నయం చేయటం ఒక లెక్కా! ఆవిడకు కాస్త నెమ్మదించింది. మేమందరమూ ఆ ఉత్సవాలకి గుండుగొలను వెళ్లి తీర్థ ప్రసాదాలు తీసుకున్నాము. ఆ సమయంలో ఇహ మనస్సును గడ్డంమీదకి పోనివ్వకుండా భగవన్నామ స్మరణలో గడిపాను. ఉత్సవాలు పూర్తి అయ్యాయి. మా వాళ్ళు అందరూ బాబు దగ్గర సెలవు తీసుకుంటుంటే, నలుగురితోపాటు నారాయణా! అంటూ, నేనూ సెలవు తీసుకున్నవాళ్లతో కలసి తిరుగు ప్రయాణమయ్యాను.

'దేవళ్ళకు నేను సెలవు ఇవ్వలేదు. ఎవరు వెళ్లమన్నారని ప్రయాణమై వెడుతున్నాడు? పిలుచుకురమ్మ'ని ఒక కుఱ్ఱాణ్ణి బస్టాండ్‌కు పంపించారు శ్రీబాబు. నేను మారు మాట్లాడకుండా పెట్టెలు తీసుకుని వెనక్కి తిరిగి వచ్చేశాను. అలా వెనక్కి తిరిగి వచ్చాక, శ్రీబాబు హఠాత్తుగా ఒక రోజు నా దగ్గరకు వచ్చి 'పాపం! గడ్డం చాలా పెరిగి పోయినట్లున్నది. చూడు దేవళ్ళూ! తిరుపతి వెళ్లి అక్కడ గడ్డం తీయించు. ముందుగా నువ్వు గుంటూరు వెళ్ళు. నేను వచ్చాక అందరం కలసి అక్కడ నుంచి తిరుపతి వెడదాం' అని సెలవిచ్చారు.

ఇహ నా ఆనందానికి అవధులు లేవు. అలా మా కుటుంబం అందరం గుంటూరు చేరుకున్నాము. బాబు కూడా భక్త బృందంతో కలసి గుంటూరు చేరుకున్నాక అందరం కలసి తిరుపతి బయలుదేరాము. శ్రీబాబు ముందే ఒక షరతు పెట్టారు. 'అందరూ కలిసే వెనక్కి వెళ్ళాలి. అంతేకాని ఎవరి మనస్సులు మీ ఇళ్లమీదకు మరల కూడదు' అన్నారు. అక్కడ శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో శ్రీబాబుతో కలసి అందరం ఎంతో ఆనందంగా గడిపాము. చివరకి నా గడ్డం తీయించుకుని, అందరం కలసి అక్కడ నుండి తిరిగి ఇళ్లకు బయలుదేరాము.

అప్పుడు బాబు నాకు నా గడ్డంలోని మర్మాన్ని తెలియజేశారు 'ప్రతివానికి కర్మ అనుభవించక తప్పదు. గడ్డం కూడా శరీరంలోని భాగమే కనుక, గడ్డం పెంచడం ద్వారా, శరీరంతో నువ్వు అనుభవించవలసిన కర్మని నీ చేత అనుభవింపజేశాను. అది తీరగానే నీ గడ్డాన్ని తీయించివేశాను' అన్నారు. దాని తరువాత నేను ఎటువంటి బాధలూ పడలేదు. నమ్మిన వారి సొమ్ము మన హృదయ బాబు!

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**మే 2019**

3 శుక్ర - మాసశివరాత్రి

4 శని - అమావాస్య

7 మంగళ - అక్షయ తృతీయ - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

9 గురు - శ్రీ శంకర జయంతి - శ్రీబాబు బృందావన మూర్తి ప్రతిష్ఠ 24వ వార్షికోత్సవము - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ; భక్తసమారాధన.

18 శని - శ్రీగురు పౌర్ణమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

23 గురు - వైశాఖ బహుళ పంచమి - శ్రీమహాకాళికా పరమేశ్వరీసమేత శ్రీరామలింగేశ్వరస్వామి వారల ప్రతిష్ఠా వార్షికోత్సవము. రాత్రి 7గం. సామూహిక లీలా కళ్యాణ మహోత్సవము.

29 బుధ - శ్రీగురుదశమి - హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

**జూన్ 2019**

1 శని - శని త్రయోదశి; మాసశివరాత్రి

3 సోమ - అమావాస్య.

11 మంగళ - జ్యేష్ట శుద్ధ నవమి - సుగుణ ప్రసాద మాతాజీవారి ద్వాదశ వార్షికారాధన.

17 సోమ - జ్యేష్ట పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

27 గురు - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

జూన్ 19 నుండి జూలై 12 వరకు శ్రీమాతాజీవారి అమెరికా పర్యటన.

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**ద్వితీయాశ్వాసము - 79వ శ్లో॥**

**ప్రహ్లాద భాగదేయం నిగమ మహాద్రేర్గుహాన్త రాధేయమ్ ।**

**నరహరి పదాభిధేయం విబుధ విధేయం మమాను సంధేయమ్ ॥**

తాత్పర్యము -

ప్రహ్లాదుని భాగ్యమును, వేదగుహ యందు వసించునదియు, నరసింహ నామము గలదియు, విద్వాంసుల కెరుగ దగినదియు నగు వెలుగును ఆశ్రయించెదను.

బాలగోపాలుని లీలలు, ఆటపాటలు, అందచందాలు అన్నీ తనివితీరా దర్శించిన మధుర కవి లీలాశుకుడు యీ శ్లోకంలో నరసింహ స్వామి రూపంలో చూసి, రెండు రూపాలకు భేదం లేదనే భావనతో తాను అనుభవించిన ఆనందాన్ని మనందరికీ అందించాడు. పరమాత్మ తత్వం నామరూపాలు వేరయినా, ఒకటే అనే సంగతి మనకు తెలియజెప్పాడు కవి అనుభవంగా. విద్వాంసులకి ఎరుగ దగిన వెలుగు అదే. ఆ వెలుగును ఆశ్రయించాలి!



## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా, మే 2019, జూన్ 2019 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***మే 2019*** - AS 3702, 7069, 7247, 7467, 7776

***జూన్ 2019*** - AS 6868, 7471-7475, 7477-7481, 7778, 7780, 7796.

- మేనేజరు

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

శ్రీ సద్గురుదేవులు తరచుగా నిర్గుణ సౌందర్యాన్ని దర్శించ మనేవారు. సగుణం చాలా గొప్పది. దాని లోని మాధుర్యాన్ని పొందనివారు వుండరు. కాని సగుణం నుంచి నిర్గుణానికి ఎదిగితేగాని ఆత్మజ్ఞానం ప్రాప్తించదు. శాస్త్ర జ్ఞానం ఎంత వున్నా, మహాత్ముల సమాశ్రయం లభించి, వారి దర్శన, స్పర్శ, సంభాషణ భాగ్యం లభించనిదే ఆత్మజ్ఞానం పొందాలనే ఇచ్ఛ కలగటం కూడా అసంభవమే.



భగవంతుడు నీకు భిన్నంగా వున్నాడని చింతన చేస్తే నీకు చింత తప్పదు. అది పరోక్షం. దానికి భిన్నంగా భగవంతుడు నీలోనే వున్నాడని భావన చేస్తే చింత ఎక్కడది? అర్జునుడు విశ్వరూప సందర్శనం పొందిన తరువాత కూడా సగుణో పాసన గొప్పదా? నిర్గుణోపాసన గొప్పదా? అని శ్రీకృష్ణ భగవానుని ప్రశ్నించాడు. గోపికలు నిర్గుణ స్థితిని సాధించారు. వారు శ్రీకృష్ణ పరమాత్ముని ప్రార్థించి తమకి 'పర' అనే పరికరాన్ని ప్రసాదించమని వేడుకున్నారు. ఆ పరికరము కృష్ణుడు ప్రసాదించి, పరమాత్మ తమకు భిన్నంగా వున్నాడనే భావనను తొలగించాడు. గోపికలకు కృష్ణ పరమాత్మ దర్శనం పొందకపోయినా, ఆయన సంభాషణ వినకపోయినా, ఆయన స్పర్శను అనుభవించకపోయినా వారికి ప్రశాంతత లేదు. కాని వారు శ్రీకృష్ణ పరమాత్ముడు ప్రసాదించిన పరికరముతో నిర్గుణ తత్వానికి ఎదిగి సర్వత్రా ఆయనని దర్శించగలిగారు.

దేహభ్రాంతి వున్నవారికి దేహం కనబడుతుంది. వారు సగుణారాధనకే పరిమితమై వుంటారు. దేహభావనను అధిగమించ గలిగినవారు నిర్గుణ సౌందర్యాన్ని దర్శించగలుగుతారు. పరమాత్మ లేని జీవునికి ఉనికి ఉన్నదా? సమస్త జగత్తు ఆయన ప్రతిబింబమైనప్పుడు ఆయన లేని ప్రదేశం ఎక్కడ వుంది? అని ప్రశ్నించారు సద్గురుదేవులు. అందుకే మరచిననూ మరపురారు అనునది అక్షరాల యదార్థము. తను, మనో, ధనాలను సద్గురుమూర్తికి సమర్పించిన సాధకుడు తాను

స్వతంత్రించి ఏదైనా నిర్ణయం తీసుకుంటే ఒక్కొక్కసారి అది అనర్థాలకి దారితీసి, తీరని దుఃఖాన్ని కలిగించవచ్చు. అట్టి సమయంలో సద్గురు మూర్తి చేసిన బోధ స్ఫురణకి వచ్చి, నిన్ను సరియైన మార్గంలో నడిపించి నీ దుఃఖాన్ని రహితం చేయకుండా ఊరుకుంటారా? అందువల్లనే సాధకుడు గురుదేవునికి చేసిన వాగ్దానాన్ని మరచి నిర్ణయాన్ని తీసుకున్నా ఆయన నీ ఉనికిని మరచిపోకుండా నీకు అభయహస్తాన్ని అందించి సహాయపడటమే సమర్థ సద్గురుదేవుల నిర్గుణ సౌందర్యానికి సంకేతము.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**మే 2019**

9 గురు - శ్రీ శంకర జయంతి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

18 శని - శ్రీగురు వైశాఖ పౌర్ణమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

29 బుధ - శ్రీగురుదశమి - హనుమజ్జయంతి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

**జూన్ 2019**

17 సోమ - జ్యేష్ఠ పౌర్ణమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

27 గురు - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

# భ్రాంతి

- పాలూరి కాళీప్రసాద్

ఒకసారి ఇద్దరు మిత్రులు కలిసి సినిమాకు వెళ్ళారు. సినిమాలో హీరో గుఱ్ఱం మీద వెడుతున్నాడు. వారిలో మొదటి మిత్రుడు 'ఇప్పుడు ఆ హీరో గుఱ్ఱం మీద నుండి క్రింద పడిపోతాడు. కావాలంటే 100రూ॥ పందెం' అన్నాడు. రెండవ మిత్రుడు ఆ హీరో పడిపోడని పందెం కాశాడు. మరి కొద్ది నిమిషాలలోనే ఆ హీరో పడిపోవడం, రెండవవాడు మొదటి వానికి 100రూ॥ ఇవ్వడం కూడా జరిగిపోయింది.

అయితే ఆ మొదటివాడు 'నేను ఈ డబ్బులు తీసుకోలేను. నేను నిన్ను మోసం చేశాను. ఆ సినిమా నేను ఇదివరకే ఒకసారి చూశాను' అన్నాడు. అప్పుడు ఆ రెండవ మిత్రుడు, 'నేను కూడా ఈ సినిమా ఇదివరకే ఒకసారి చూశాను. అయినా, ఆ హీరోకి ఏ మాత్రం బుద్ధి వున్నా, ఒకసారి గుఱ్ఱం మీద నుండి పడినవాడు రెండవసారి జాగ్రత్తగా వుంటాడులే అనుకొని నీతో పందెం కాశాను. కానీ ఆ బుద్ధిలేని హీరో మళ్ళీ అలాగే పడిపోయాడు' అన్నాడు.

ఇది వింటే ఆ రెండవవాడి అమాయకత్వం చూసి మనం నవ్వుకుంటాం. కానీ ప్రతిరోజూ మనం చేస్తున్నది కూడా అదే. మన జీవితంలో ప్రతిరోజూ ఇలాంటి భ్రాంతి, భ్రమలకు లోనవుతున్నాము. ఎలాగో చూద్దాం. మనకు ప్రధానంగా ఆరుగురు శత్రువులున్నారని పెద్దలు చెబుతారు కదా! అవే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. ఇవి ప్రబల శత్రువులు. అలాగే వీటి దాహం తీరదని, ఎంత సమర్పించుకున్నా, అగ్నిలో వేసిన నెయ్యిలాగా ఇంకా ఇంకా ప్రజ్వరిల్లుతూనే వుంటాయని సాక్షాత్తు భగవంతుడే గీతలో చెప్పాడు కదా! అయినా మనం ప్రతిసారీ 'ఈ ఒక్కసారికి వాటి మాట విని, వాటి ఆకలి తీరిస్తే మళ్ళీ మన జోలికి రావులే!' అనుకుంటూ మళ్ళీ మళ్ళీ వాటికి లొంగి పోతూనే వుంటాము.

ఒకరికి విపరీతమైన సుగర్ వ్యాధి వుంటుంది. కానీ తీపి అంటే ఎంతో ఇష్టం. 'ఈ ఒక్కసారికి తినేస్తే ఆ కోరిక తీరిపోతుందిలే. ఆ తరువాత ఇంకెప్పుడూ తినవద్దులే' అనుకుంటూ తినేస్తాడు. అయితే ఆ కోరిక అక్కడితో ఆగుతుందా? మళ్ళీ మళ్ళీ తీపివైపుకే మనస్సు పోతుంది. వీడు లొంగుతూనే వుంటాడు. చివరకు వాడి ప్రాణం మీదకు తెచ్చుకుంటాడు.

ఇలాగే మిగిలిన అయిదు దుర్గుణాలకు కూడా వద్దనుకుంటూనే మాటిమాటికి లొంగిపోతూ వుంటాము.

అయితే పైన చెప్పుకున్న కథలో మొదటివాడు ఎందుకు భ్రాంతిలో పడలేదు? రెండవవాడు ఎందుకు పడ్డాడు? అని విచారిస్తే మొదటివాడు 'ఇది సినిమా. ఎన్నిసార్లు చూసినా ఇందులో మార్పు ఏమీ వుండదు. ఇది ఎప్పటికీ నిజం కాబోదు' అనే జ్ఞానాన్ని కలిగి వున్నాడు. ఇక రెండవ వాడు సత్యానికి, కల్పనకి భేదం తెలుసుకోలేక, ఆ కల్పనే నిజమని భ్రమించి, ఎప్పటికయినా అది మంచిగా మారకపోతుందా అనుకుంటూ అందులో లీనమై, మళ్ళీ మళ్ళీ ఆత్రంగా చూస్తూనే వున్నాడు. ఇదే మనకు, జ్ఞానులైన మహాత్ములకు వున్న తేడా. మనం ఈ చూసే ప్రపంచమంతా సత్యమేననే భ్రమలో పడి 'ఇందులో రమించడం మన ఆధ్యాత్మిక ఉన్నతికి అవరోధం' అని మన బుద్ధి మాటిమాటికి హెచ్చరిస్తూనే వున్నా, 'ఎప్పటికైనా ఇందులోనే మనకు కావలసినది దొరకక పోతుందా' అని మళ్ళీ మళ్ళీ లేనిచోటే మన ఆనందాన్ని వెతుక్కుంటూ వున్నాము.

మనం సినిమాకి వెళ్ళినప్పుడు అందులోని నవరసాలను మన జీవితంలోనే జరుగుతున్నట్లుగా తాదాత్మ్యం చెంది, అనుభవిస్తూనే వుంటాం కానీ, అంతర్లీనంగా 'ఇది కేవలం సినిమా మాత్రమే. నిజం కాదు' అనే జ్ఞానం మనకు వుంటుంది. అందుకే సినిమాలో బాంబు పేలితే మనం అక్కడ నుంచి పారిపోము, హత్య జరిగితే పోలీసులకి ఫోన్ చెయ్యం. మహాత్ములకు నిజ జీవితంలో కూడా నిరంతరం ఈ జ్ఞానం ఆరూఢమై వుంటుంది. అందుకే వారు మనందరి భిన్నత్వాన్ని గుర్తిస్తూ, ఎవరికి తగ్గ రీతిలో వారితో మాట్లాడుతూ, వారివారి సమస్యలను, సంతోషాలను అన్నింటినీ వింటూ, పరిష్కారాలను సూచిస్తున్నా, వారిలో అంతర్లీనంగా, 'ఇదంతా ఒక సినిమాలాంటిదే. నిజం కాదు. ఉన్నది భగవంతుడు ఒక్కడే. నేను, నా ఎదురుగా వున్నవాడు, వాడికి సమస్యని సృష్టించినవాడు అందరూ ఆ భగవంతుని రూపాలే అనే జ్ఞానం సదా నిలిచి వుంటుంది. మనం కూడా అటువంటి జ్ఞానాన్ని పొందేవరకు ఈ భ్రాంతులు తప్పవు.

(గత సంచిక తరువాయి) # కైవల్యోపనిషత్ - రేఖ

శ్రీ మాతాజీవారు వారి బోధను తిరిగి కొనసాగిస్తూ, ఉపనిషత్ లోని 6వ మంత్రం యొక్క భావార్థాన్ని ఇలా చెప్పారు. ఇక్కడ 25వ తత్త్వమైన ఆ పరమాత్మ తత్త్వాన్ని గురించి చెప్పారు. పదమూడు విశేషణాలతో ఆ పరబ్రహ్మాన్ని సూచించి, వివరిస్తున్నాడు బ్రహ్మదేవుడు. అది అచింత్యం. చింతింపనలవికానిది. జీవితాంతం ఈ విషయం గురించి చింతన చేయలేము. అటువంటి అచింత్యమైన రూపమే అయి వున్నావు. పరమాత్మ ఇంద్రియ మనో బుద్ధులచే గ్రహించే విషయం కాదని తెలియ బరచడానికి అచింత్యం అన్నారు.

ఇంద్రియ గ్రాహ్యం కాదు కాబట్టి 'అవ్యక్తం' అది. వ్యక్తమంటే ఒక వస్తువుగా కనిపించాలి. కాని అలాకాదు. ఎందుకంటే అది ఈ కనిపించే వస్తు ప్రపంచానికి, రూపాలన్నిటికీ కారణమయింది. ఇంద్రియాలకి అగోచరమైనది పరబ్రహ్మస్వరూపం. శ్రవణేంద్రియానికి వినిపించే శబ్దాలన్నిటికీ కూడా కారణమైనటువంటిది. అందుకనే ఈ నానా రూప ప్రపంచంలో మనం అనుభవించే విషయాలన్నీ ఆ పరమాత్మ యొక్క అభివ్యక్త రూపాలే. కాబట్టి పరమాత్మను 'ఏకం', 'అనంత రూపం' అని కూడా అన్నారు.

అది 'శివం' అంటే శుభప్రదమైనది. ఈ ఆత్మానందానుభూత స్థితిలో దేహ మనో బుద్ధుల ద్వారా అనుభవించే దుఃఖాదులు వుండవు. ఎందుకంటే అది పరిపూర్ణ స్థితి. ప్రకాశ స్వరూపమైనది. సచ్చిదానంద స్వరూపమైనది. మనో బుద్ధుల వ్యవహారాలైన విక్షేపాలు ఆత్మని మలిన పరచలేవు. వీటన్నిటికీ అతీతమైనది కాబట్టి అది ఎప్పుడూ 'ప్రశాంత'మైనది. అది 'అమృతం' అంటే మార్పులేనిది. ఆత్మానంద సృష్టికర్త అయిన బ్రహ్మదేవుని పుట్టుకకు కూడా కారణమైనది. ఆ పరమాత్మయే ఆ సృజన శక్తికి జన్మస్థానమైన గర్భము కాబట్టి ఆ పరమాత్మ 'బ్రహ్మయోనిం' సృష్టి కర్త పుట్టుకకు కారణం అయినది అన్నారు.

ఆత్మ కాలము చేత పరిమితము కానిది. 'ఆది మధ్యాంత రహిత'మైనది. అది నిత్యమైనది. దానికంటె అంటే పరమాత్మకంటె ఇతర మైనది లేదు. అందుకని అది 'ఏకం' ఎలా? అంటే అది ఒక్కటే! అది 'విభుం' సర్వవ్యాపి. రూపం పరిమితిని సూచిస్తుంది కాబట్టి

సర్వవ్యాపకమైనదానికి రూపం అది 'అనంతం'. ఆ పరమాత్మ మన బుద్ధికి అందేది కాదు కాబట్టి అది 'అచింత్యం'. ఆశ్చర్యం కలిగినప్పుడు మనోబుద్ధులు పనిచేయవు. అప్పుడు ఆ ఆశ్చర్యకరమైన అనుభూతిలో వుండే మనఃస్థితిని 'అద్భుతం' అన్నారు.

పైన చెప్పిన లక్షణాలన్నీ కలసివున్న ఆత్మను గురించి బుద్ధితో గ్రహించి, మనసులో కలిగిన అనుభవమే ధ్యానం. ఆ పరమాత్మను ఈ విధంగా హృదయ కుహరంలో ధ్యానించాలి. ఇదే నిర్గుణోపాసన.

రూపాలన్నిటికీ ఆధారం దక్షిణామూర్తి రూపం. అంటే అరూపమైన అమూర్తత్వమైనది. శ్రీబాబూజీ మహరాజ్‌వారు సగుణనామాలతో అర్చించే కంటే, నిర్గుణ నామాలతో అర్చిస్తున్నప్పుడు ఎక్కువగా ఆనంద పడేవారు. ఉదాహరణకి అవ్యక్తాయ నమః, అచింత్యాయ నమః, అరూపాయ నమః మొదలగునవి.

శ్రీ మాతాజీ ఇంకా బోధ చేస్తూ .... 'భగవద్గీతలో 2వ అధ్యాయంలో, 22వ శ్లోకంలో 'వాసాంసి జీర్ణాని యథా విహాయ ....నవాని దేహీ' దానికి అర్థం చెబుతూ అవతారాలు అన్నీ మార్పు చెందేవి. మహాత్ములు ధర్మ సంరక్షణార్థం ఒక దేహం అవతారం దాల్చి వచ్చినా, అది కూడా కొంత కాలానికి మార్పుచెందుతుంది. మన హృదయంలోని ధ్యేయ వస్తువుని, లక్ష్యాన్ని ఎవరూ ఛేదించలేరు.

నిజమైన భక్తుడు ఆంజనేయుడని చెప్పుకోవచ్చు. ఆంజనేయ స్వామికి సీతమ్మవారు బహుమతిగా ఇచ్చిన ముత్యాలహారం కొరకటం మొదలుపెట్టాడు. ఈ సంఘటనకు చుట్టూ వున్న వారంతా దిగ్భ్రమ చెంది, అమ్మవారిచ్చిన హారాన్ని అలా అవమాన పరచావెందుకని ప్రశ్నిస్తే, దానికి సమాధానంగా హనుమ 'తన రాముడు ఆ హారంలో ఎక్కడ వున్నాడో అని వెతుకుతున్నాను' అన్నాడు. వారంతా తిరిగి అయితే రాముడెక్కడ వున్నాడని నిలదీసి ప్రశ్నిస్తే, తన హృదయం చీల్చి సీతారాములను చూపెట్టాడు హనుమ. అది నిజమైన భక్తి అంటే.

మన ఆరాధ్య దైవం మన హృదయంలో లేడా? మనలను విడిచిపెట్టి వుంటే దైవం ఎలా అవుతాడు? ఆంజనేయ స్వామి వంటి దృఢమైన నిశ్చయ భక్తి, నిశ్చల భావనతో ఆరూఢమైనప్పుడు మనను దాటి ఆ తత్వం ఎక్కడ వుంటుంది? వుండదు" అన్నారు.

-సశేషం

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## బళ్ళారి శాస్త్రిగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

గురుకృప ఒక్కటే ఆత్మజ్ఞానోదయమునకు, ఆత్మోద్ధరణమునకు ముఖ్య సూత్రము. శ్రీ బాబు సహజ కరుణామూర్తి. "నన్ను దృఢముగా నమ్మిన వారిని ఎన్నడును దూరము చేయ"నని శ్రీ కృష్ణ పరమాత్మ చెప్పినట్లుగానే మన బాబు నిత్యము మనకు 'Why Fear? I Am Here !' అని అభయమిస్తున్నారు. నమ్మి చెడిన వారు లేరు. భక్తులెల్లరు అనన్య గురుభక్తితో శ్రీ బాబు యెడల సంపూర్ణ విశ్వాసము నుంచి వారి నిరంతర కృపను పొంద గలందులకు మన:పూర్వకంగా ప్రార్థిస్తున్నాను.



ఏ హిమాలయములలోనో ఏకాంతముగా ఆత్మానుభూతిలో ఓలలాడుతూ ఉండగోరిన శ్రీ బాబు, భక్తుల అభ్యర్ధనను మన్నించి, మన మధ్యనే నిలిచి, శృతి స్మృతి అనుభవములను సమ్మేళన పరచి, మృదు మధుర శైలిలో అత్యుత్తమ బోధలను అందజేస్తూ, అద్వైత బోధలను అందజేస్తూ, అద్వైత సింహాసనాధిష్టులై, నిగూఢ వేదాంత రహస్యాలను సింహగర్జనతో వెల్లడి చేస్తూ, వేదాంత వీధులలో తాము విహరిస్తూ, మనందరిని విహరింపజేస్తూ, బోధామృత తరంగాలలో ఓలలాడిస్తూ, ఆడుతూ-ఆడిస్తూ, పాడుతూ-పాడిస్తూ, తాము పరవశించి, మనలను పరవశింపజేసే ఆ పరమాత్ముని పరమానుగ్రహమును పొందగలిగిన మన భాగ్యమే భాగ్యము.

ఎన్నియెూ మార్గ్లు, ఎన్నియెూ ప్రదేశములలో ఆశ్రమ నిర్మాణమునకు ప్రయత్నాలు జరిగాయి. కాని చివరకు నంబూరులో శ్రీ కాశీ వనాశ్రమము నెలకొల్పబడినదంటే అదంతయు ఆ స్థల భోగము; భక్తులందరి అదృష్టము. విశ్వ మానవాళి హృదయాలలో విజ్ఞాన జ్యోతులను వెలిగించగల పరంజ్యోతి స్వరూపులైన మన గురుదేవులు

శ్రీ బాబు యీ ఆశ్రమమును కేంద్రంగా చేసుకుని, తమ అవతార కార్యమును నెరవేర్చుకుంటున్న యీ మహత్తర దృశ్యాన్ని మా పూర్వ దేశికులు, శ్రీ బాబుకు 'నాన్నగారైన పరశురామయ్యగారు తమ భావనా చిత్రంలో ఏనాడో దర్శించుకున్నారు. అది యదార్థమై యీనాడు యిలా మన చర్మ చక్షువులకు గోచరం కావటము, యీ అపూర్వ అమూల్య సన్నివేశాన్ని తిలకించే భాగ్యాన్ని నాకు కలుగజేయటానికి శ్రీ బాబు నన్ను యిలా యీ శరీరంతో నిలిపి ఉంచటము నా జన్మ జన్మల సుకృతంగా భావిస్తున్నాను.

పరమ పవిత్రమైన యీ ఆశ్రమ నివాస భాగ్యమును మనకందరికి శ్రీ బాబు ప్రసాదించారు. అందుకు కృతజ్ఞులమై, శ్రీ బాబు ప్రారంభించిన అఖండ జ్ఞాన యజ్ఞంలో మనం యధా శక్తిగా సమిధలమై సేవించుకోగలిగితే, వారు మనకు అనుగ్రహించిన యీ మానవ జన్మకు సార్థకత కలుగుతుంది. "

శాస్త్రిగారు యీ మహదవకాశమును తాము అలాగే సద్వినియోగం చేసుకున్నారు. ఉద్యోగ విరమణానంతరం 1972లో శాస్త్రిగారు సకుటుంబంగా ఆశ్రమానికి వచ్చి స్థిరనివాస మేర్పరచుకున్నారు. నిత్య ప్రార్థన, దైవదర్శనములతో బాటు నిరంతర తత్త్వ విచారణలోనే తమ సమయమును గడిపారు. శ్రీ బాబు అవకాశం లభించినప్పుడల్లా శాస్త్రిగారిని తమ వద్దకు పిలిపించుకొని తత్త్వ విచారణతో బాటు, సరస సల్లాపాలతో శాస్త్రిగారిని అలరించేవారు. అల్లరి చేసేవారు. చక్కలిగింతలు పెట్టి నవ్వించే వారు. ఒకసారి తమతో పాటు భోజనానికి కూర్చోబెట్టుకొని, శ్రీబాబు శాస్త్రిగారి నోటి నిండా లడ్డూ పెట్టారు. శాస్త్రిగారు ఉక్కిరి బిక్కిరి అవుతుంటే "ఏదీ యిప్పుడు మాట్లాడండి చూద్దాం! నోటి నిండా పదార్థం ఉంటే శబ్దం ఎక్కడి నుంచి వస్తుంది? అలాగే మనస్సంతా పరమాత్మ భావనతో నిండి ఉంటే, అంతటా నిశ్శబ్దమే; పరమ శాంతియే; బ్రహ్మానందమే. 'నిశ్శబ్దం బ్రహ్మ ఉచ్యతే'. అక్కడ జగత్తంతా యాబ్సెంటు ఏజెంటుగారొక్కరే ప్రజంటు ఏమంటారు ఏజెంటుగారూ?" అని పక పక నవ్వేశారు.

-సశేషం

# శ్రీమాతాజీ ఆశ్రమేతర కార్యక్రమములు

**మే 2019**

3 శుక్రవారం నుండి 5 ఆదివారం వరకు చంద్రకాళీ బ్లాసమ్స్, అమృతనగర్ బెంగళూరులో సత్సంగ సమావేశాలు జరుగుతాయి.

14 మంగళవారం చెరుకూరు, ఆత్మబోధానందాశ్రమము శ్రీ వీరబ్రహ్మం గారి ఉత్సవాలలో శ్రీ మాతాజీ వారు ప్రసంగిస్తారు.

15 శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ క్షేత్రం, ముక్కామలలోశ్రీధర స్వామీజీ వారి కార్యక్రమంలో శ్రీమాతాజీవారు పాల్గొంటారు.

20 సోమవారం నుండి 27 సోమవారం వరకు మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం, ద్రాక్షారామంలో హరేరామ నామ సంకీర్తన సత్సంగ సప్తాహం శ్రీమాతాజీ వారి అధ్వర్యంలో జరుగుతాయి.

29 బుధవారం - నిండ్రకొలను ఆశ్రమ బ్రాంచిలో హనుమజ్జయంతి కార్యక్రమంలో శ్రీ మాతాజీ పాల్గొంటారు.

30 పావులూరులో 108 రోజుల హరేరామ నామ సంకీర్తనను శ్రీ మాతాజీవారు ప్రారంభిస్తారు.

**జూన్ 2019**

1శనివారంనుండి - 6 గురువారం వరకు శ్రీ కాళీవనాశ్రమం, శ్రీ అవధూతనిలయం పావులూరులో పరమపూజ్య శ్రీ.శ్రీ.శ్రీ అవధూతేంద్ర సరస్వతి స్వామి వారి వార్షిక పుణ్యారాధన పాంచాహ్నిక మహోత్సవాలలో శ్రీ మాతాజీ పాల్గొంటారు.

9 ఆదివారం - నందికొట్కూరు, కర్నూలుజిల్లా, శ్రీ హనుమత్కాళీప్రసాద ఆశ్రితాశ్రమ వార్షిక మహోత్సవంలో శ్రీమాతాజీ వారు ప్రసంగిస్తారు.

# శ్రీమాతాజీవారి విదేశ పర్యటన కార్యక్రమాలు

జూన్ 2019

16 ఆశ్రమంనుండి బయలుదేరి ఢిల్లీ చేరుతారు. శ్రీమాతాజీతో రాజా శివానంద్, శ్రీమతి పద్మగార్లు ప్రయాణిస్తారు. (సెల్:8008000969)

19 ఢిల్లీ నుండి బయలుదేరి, అమెరికా డెట్రాయిట్ చేరి బాబు, వెంకటలక్ష్మి గృహంలో వుంటారు. (సెల్:1-248-895-0511).

అక్కడనుండి నార్టన్‌షోర్స్ చేరి, డా. అరుణ. కిషన్ గారి వద్ద ఉంటారు అరుణ సెల్: + 1-314- 825-3102).

28 షాంపైన్ (ఇలినోయిస్)కు వెళ్ళి అక్కడనుండి సైంట్‌లూయిస్ (మిస్సోరి) చేరుతారు. డా॥కురుచేటి ప్రసాద్ - 0013149936212.

జూలై 2019

01 వాషింగ్‌టన్( వర్జీనియా) చేరి, శ్రీ కాళీ ప్రసాద్ నూనె, శ్రీమతి ఆలేఖ్య దంపతుల గృహంలో (సెల్: + 1-267-357-7956)ఉంటారు.

04-7-2019 నుండి 07-07-2019 వరకు సత్సంగం.

04-07-2019న శ్రీనూనె కాళీ ప్రసాద్. ఆలేఖ్య దంపతులచేత త్రయాహ్నిక దీక్ష ప్రారంభింపజేస్తారు. అమెరికాలోని వివిధ ప్రాంతాలనుండి భక్తులు అక్కడకు వచ్చి ఈ కార్యక్రమాలలో పాల్గొంటారు.

07-07-2019న దీక్షా విరమణ, మహామంగళహారతితో అక్కడ కార్యక్రమాలు ముగుస్తాయి.

08 శ్రీశ్రీనివాస ప్రసాద్ దుగ్గిరాల, శ్రీమతి పద్మ దంపతుల గృహంలో వుంటారు (సెల్:001-404-509-9597).

10 బోస్టన్ చేరుతారు. అక్కడ అన్నం బాబు ప్రసాద్ గారి వద్ద వుంటారు. సెల్ నెం. 001(732)986-7587

12 అమెరికా నుండి బయలుదేరి

13-7-2019న నార్వే చేరుతారు. శేషప్రసాద్, శ్రీమతి గీత దంపతుల గృహంలో కార్యక్రమాలు జరుగుతాయి. సెల్ 004745282464

16 - గురుపూర్ణిమ నాడు శ్రీ సద్గురు పాదపూజ జరుగుతుంది.

18 ఆమ్‌స్టర్‌డామ్ (నెదర్‌లేండ్స్) చేరి అక్కడ కరుణాకర చరణ్, జ్యోత్స్న, మరియు ఆదిత్య, రాజీ గార్లు శ్రీమాతాజీ వద్ద ఉంటారు. సెల్ - 0031687448929. శ్రీ కుమారస్వామి రాజా, కోమలి దంపతులు

కూడా శ్రీ మాతాజీతో ప్రయాణం చేస్తారు.
21 - లండన్ చేరుతారు. తవ్వా ప్రసాద్‌గారింట్లో వుంటారు.
22 - లండన్ నుండి స్కాట్‌లెండ్ చేరి శ్రీ కాళీచరణ్, ప్రసన్న దంపతుల గృహంలో (సెల్: 07738226177 1)ఉంటారు.
25 లండన్ చేరి,శ్రీ తవ్వా ప్రసాద్ దంపతుల గృహం చేరుకొంటారు. (సెల్:07990523652)
27 - సెంట్ జాన్ విలేజ్ మెమోరియల్ హాల్, సెంట్ జాన్ లై, సెంట్‌జాన్స్ వోకింగ్‌లో సామూహిక శ్రీ సత్యన్నారాయణ వ్రతం, కుంకుమపూజలు జరుగుతాయి.
28 - 30 వరకు త్రయాహ్నిక దీక్షతో సత్సంగ కార్యక్రమాలు ఉంటాయి.
30 - దీక్షా విరమణ, మహా మంగళహారతి.
31శ్రీమాతాజీ వారు బయలుదేరి. 1-8-2019న ఢిల్లీ చేరుతారు.



శ్రీ కాళీప్రసాద స్వచ్ఛంద సేవా సంస్థ, కర్నూల్ వారు 31-3-2019నాడు ఏర్పాటుచేసిన చలివేంద్రమును ప్రారంభిస్తున్న సి.ఐ. శ్రీ గోవింద నాయక్, సంస్థ వ్యవస్థాపకులు ధర్మారెడ్డిగారు, మరియు తదితరులు.

(గత సంచిక తరువాయి) **విష్ణు కథలు** - రమణ ప్రసాద్

# శ్రీ స్వామి వివేకానంద

గురుదేవులు నాతో "ఇప్పుడు నీకు తెలిసింది. కాని దాని తాళం చెవి నా వద్ద ఉంచుకుంటాను" అని చెప్పారు. అప్పుడు నేను "నాకు ఏంజరిగింది? అని ఆయనను అడిగాను. ఆయన భక్తులవైపు తిరిగి 'తాను ఎవరన్నదీ ఇతడికి తెలిస్తే ఇతడు తన దేహాన్ని నిలుపుకోడు. వాని కళ్ళకి ముసుగు వేసి ఉంచాను.' అన్నారు."



"ఒక రోజు సాయం సమయంలో ధ్యానంలో నేను దేహస్మృతులు కోల్పోయాను. అసలు శరీరమే లేనట్లు అనిపించింది. సూర్యుడు, చంద్రుడు, దేశకాలాలు, ఆకాశం అవ్యక్తంలో లీనమైపోయాయి. దేహస్మృతి మాయమై పోయింది. ఇంచుమించు పరమాత్మలో విలీనమయ్యాను. కాని నాలో 'అహం' అనే భావన జాడ మాత్రముగా వున్నందున సమాధినుండి వ్యావహారిక స్థితిలోకి రాగలిగాను. ఆ సమాధి స్థితిలో 'నేను', 'బ్రహ్మ' అనే వాటి మధ్య నెలకొని ఉన్న భేదం లుప్తమైంది. సమస్తం ఏకమై పోయింది. అది అనంత సాగరంగా ఎక్కడ చూసినా నీరు తప్ప మరేమీ లేనట్లుగా ఉంది. అప్పుడు అవాఙ్మానసగోచర స్థితి అంటే మనస్సుకు, వాక్కుకు అతీతమైన స్థితి ప్రత్యక్షంగా సాక్షాత్కరించింది. తరువాత సమాధి స్థితి కలుగలేదు.

గురుదేవులు ఇలా అన్నారు 'రేయింబవళ్లు నువ్వు ఆ స్థితిలో ఉంటే జగజ్జనని కార్యం సిద్ధించదు కనుక ఆస్థితిని ప్రాప్తించుకోలేవు, నీ కార్యం పూర్తి అయ్యాక ప్రాప్తిస్తుంది' అన్నారు."

"కాశీపూర్ లో తమ శక్తిని నాలో ప్రసరింప చేశారు. శ్రీ రామ కృష్ణులు ఒక కాగితంమీద నరేన్ జనులకు బోధిస్తాడు అని వ్రాశారు. కాని నేను

ఆయనతో 'నేను అటువంటిపని చెయ్యను' అని చెప్పాను. అందుకు ఆయన 'నీ నరనరాలు దాన్ని చేస్తాయి' అన్నారు."

"నేను ఇప్పుడు ఉపదేశించే భావనలన్నీ శ్రీ రామకృష్ణుల భావనలను ప్రతిధ్వనింప చేయటానికి చేస్తున్న ప్రయత్నమే. శ్రీరామకృష్ణులు దేహత్యాగానికి మూడు రోజుల ముందు ఆయన "కాళీ" అని పేర్కొనే ఒక శక్తి నాలో ప్రవేశించింది. ఆ శక్తే నన్ను అక్కడికి, ఇక్కడికి తీసుకుపోయి నా వ్యక్తిగత సుఖాన్ని చూసుకోనివ్వకుండా పని చేయిస్తోంది."

"దేహన్ని త్యజించే రెండు రోజుల ముందు నన్ను తన వద్దకు పిలచి ఎదురుగా కూర్చోమన్నారు. తదేక దృష్టితో నా వంక చూస్తూ సమాధిమగ్నులయ్యారు. అప్పుడు ఒక సూక్ష్మశక్తి విద్యుద్ఘాతం లాగా నాలో ప్రవేశించినట్లు అనిపించింది. కొద్దిసేపట్లో నేను బాహ్యస్మృతిని కోల్పోయాను. బాహ్య స్మృతిరాగానే శ్రీ రామకృష్ణులు కన్నీరు కారుస్తూ కనిపించారు. వాత్సల్యంతో ఇలా అన్నారు. 'ఈ రోజు నా సర్వస్వం నీకు ధారపోసి నేను ఫకీరు నయ్యాను ఆ శక్తితో నువ్వు లోకహితం కోసం ఎన్నోకార్యాలు నిర్వర్తించవలసి ఉంది" అన్నారు.

-సశేషం

**శ్రద్ధాంజలి**

శ్రీబాబూజీ పరమ భక్తులు, ఆశ్రమవాసులు అయిన యర్రగుంట్లపాటి కృష్ణమనోహర్ (విజయవాడ) 12-4-2019 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 68 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL